# విశాల భారతి
తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

శుక్రవారం, హైదరాబాద్ 07.02.2025 | 24 క్యారెట్లు 86,316.00 | కిలో వెండి 98,787.00 | 32 ℃ | సంపుటి:3 సంచిక:108

www.vishalabharati.com


# రాష్ట్రానికి రూ.176.5 కోట్లు



- గుడ్ న్యూస్‌చెప్పిన కేంద్రం
- నిధులు విడుదల చేసిన కేంద్ర రహదారుల మంత్రిత్వ శాఖ
- నిర్దేశిత మైల్‌స్టోన్ సాధించినందుకు ప్రోత్సాహకం

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. కేంద్ర ప్రభుత్వ రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ రాష్ట్రాలకు ప్రత్యేక మూలధన పెట్టుబడి సహాయం (SASCI) పథకం కింద తెలంగాణకు రూ.176.5 కోట్ల విడుదలకు ఆమోదం తెలిపింది. ఈ పథకం కింద.. నిర్దేశించిన మైల్‌స్టోన్‌ని సాధించినందుకు రాష్ట్రాలు ప్రోత్సాహక మొత్తాన్ని పొందేందుకు అర్హులు. కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ ప్రకారం.. తెలంగాణ ఇన్షియేటివ్ Aకు సంబంధించి మైల్‌స్టోన్ 1,

..మిగతా 2 లో

# ప్రైవేటు ఆస్తులపై ప్రభుత్వ పెత్తనమేంది..?

- నిషేధిత జాబితాలో చేర్చే అధికారం లేదు
- మార్గదర్శకాలకు విరుద్ధ నిర్ణయాలు చెల్లవు
- హైకోర్టు కీలక ఆదేశాలు




విశాలభారతి, స్టేట్ బ్యూరో:

ప్రైవేటు ఆస్తులను నిషేధిత జాబితాలో చేర్చే అధికారం ప్రభుత్వానికి, అధికారులకు లేదని.. దీనికి సంబంధించి చట్టంలో స్పష్టంగా ఉందని హైకోర్టు తేల్చి చెప్పింది. రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22ఏ కింద అనుసరించాల్సిన మార్గదర్శకాలకు విరుద్ధంగా ప్రైవేటు ఆస్తులను నిషేధిత జాబితాలో చేర్చలేరని

..మిగతా 2 లో

# రాష్ట్రంలో పవర్ డిమాండ్

- రోజురోజుకూ పెరుగుతున్న ఎండలు
- భారీగా పెరిగిన విద్యుత్ వినియోగం
- గురువారం రికార్డు స్థాయిలో 15,752 మెగావాట్ల డిమాండ్
- స్పష్టం చేసిన విద్యుత్ శాఖ

2 లో



# గీత దాటితే వేటే..
## సమస్యలుంటే అంతర్గతంగా చర్చిద్దాం

- ప్రత్యేకంగా మీటింగ్ పెడితే సహించేది లేదు
- పార్టీపై విమర్శలు చేస్తే చర్యలు తప్పవు
- సమస్యలుంటే నాకు లేదా మంత్రులకు చెప్పండి
- లేకపోతే నేరుగా రాహుల్‌గాంధీకి చెప్పొచ్చు
- స్థానిక ఎన్నికల్లో గెలుపు బాధ్యత ఎమ్మెల్యేలదే
- 90% సీట్లు సాధించేలా కృషి చేయాలి
- పథకాలు, ప్రభుత్వ నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- ఎక్కువ పంచాయతీలను ఏకగ్రీవం చేయండి
- ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ వార్నింగ్

> పార్టీ లైన్ దాటితే వేటు తప్పదని సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇన్ ఛార్జ్ దీప దాస్ మున్షీ ఎమ్మెల్యేలకు వార్నింగ్ ఇచ్చారు. గురువారం జరిగిన సీఎల్పీ సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఏమైనా సమస్యలు ఉంటే అంతర్గతంగా చర్చించుకోవాలని సూచించినట్లు సమాచారం. పార్టీపై బహిరంగంగా విమర్శలు చేస్తే కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఎవరైనా నేతలు కాంగ్రెస్ పార్టీ నిర్ణయాలను వ్యతిరేకిస్తే.. కఠినంగా వ్యవహరించాలని సీఎల్పీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది.



విశాలభారతి, స్టేట్ బ్యూరో:

పార్టీ విధానాలపై ఎవరికైనా అనుమానాలు ఉంటే.. అంతర్గతంగా చర్చించాలని సీనియర్ కాంగ్రెస్ నేతలు సూచించినట్లు తెలుస్తోంది. మరోవైపు.. పార్టీ నిర్ణయాలపై ఏమైనా అభ్యంతరాలున్నా, ఏవైనా సమస్యలున్నా నేరుగా తనను కలిసి మాట్లాడాలని నేతలకు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఒకవేళ అధిష్ఠానానికి చెప్పాలనుకుంటే.. తానే స్వయంగా రాహుల్ గాంధీ అప్పాయింట్ మెంట్ ఇప్పిస్తానని కూడా చెప్పినట్టు తెలుస్తోంది.

**సీక్రెట్ మీటింగులు పెడితే కఠిన చర్యలు..**

ఇదే క్రమంలో.. తెలంగాణ కాంగ్రెస్ ఇంచార్జ్ దీపా దాస్ మున్షీ కూడా నేతలకు వార్నింగ్ ఇచ్చినట్టు తెలుస్తోంది. పార్టీ అంతర్గత విషయాలు బహిరంగ వేదికలపై మాట్లాడితే చర్యలు తప్పవని నేతలకు వార్నింగ్ ఇచ్చినట్టు సమాచారం.

**పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి..**

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో నేతలు తీవ్రంగా విఫలమవుతున్నారంటూ మున్షీ అసంతృప్తి వ్యక్తం చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలో జరగని కులగణన, ఎస్సీ వర్గీకరణ తెలంగాణలో చేసినా.. అనుకున్న స్థాయిలో ప్రచారం చేయడం లేదని మున్షీ అసహనం వ్యక్తం చేశారు. సీఎల్పీ సమావేశం అనంతరం

..మిగతా 2 లో



# రాష్ట్రంలో రెండు భారీ సభలు

- సూర్యాపేటలో బీసీ సభ
- గజ్వేల్‌లో వర్గీకరణ సభ
- ఖర్గే, రాహుల్ గాంధీని ఆహ్వానిస్తాం
- పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

2 లో

# పార్టీ మారిన ఎమ్మెల్యేలపై వేటు పక్కా

- ఉప ఎన్నికలు రావాలని ప్రజలు ఆశిస్తున్నారు
- ఎమ్మెల్యేల తీరుపై న్యాయ నిపుణులతో చర్చిస్తున్నాం
- యూజీసీ నిబంధనలను మార్పుపై అభ్యంతరాలు
- కేసీఆర్‌ఆదేశాలతోనే కేంద్ర మంత్రిని కలిశాం
- వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

> ఉప ఎన్నికలు రావాలని ప్రజలు కూడా కోరుకుంటున్నారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు సుప్రీంకోర్టు నోటీసులు ఇచ్చింది, వారిపై అనర్హత వేటుపడాలని చెప్పారు. అదే అంశంపై న్యాయం నిపుణులతో చర్చిస్తామని అన్నారు.



విశాలభారతి, స్టేట్ బ్యూరో:

సాయంత్రం ఢిల్లీ పర్యటన ముగించుకుని హైదరాబాద్ బయలుదేరుతానని తెలిపారు. కేసీఆర్ ఆదేశాల మేరకు ఢిల్లీలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిశామని చెప్పారు. యూజీసీ నిబంధనలు మార్చడంపై తమ అభ్యంతరాలు తెలియజేస్తూ ఒక విజ్ఞప్తి అందజేశామని కేటీఆర్ తెలిపారు. నూతన నిబంధనలతో

..మిగతా 2 లో

## చేతులకు బేడీలు, కాళ్లకు గొలుసులు
# భారత్‌కు వచ్చే వరకూ అంతే

- అక్రమ వలసదారులపై అమెరికా దాష్టీకం
- అక్రమ వలసదారుల తరలింపు కొత్తేం కాదు
- అది అన్ని దేశాల బాధ్యత
- రాజ్యసభలో కేంద్ర మంత్రి జైశంకర్ ప్రకటన
- బేడీలు వేయడంపై విపక్షాల ఆందోళన



విశాలభారతి, నేషనల్ బ్యూరో:

అక్రమ వలసదారులను స్వదేశాలకు తిప్పి పంపడం కొత్తేమీ కాదని విదేశాంగ మంత్రి జైశంకర్ స్పష్టం చేశారు. 2009 నుంచి ఇలాంటి బహిష్కరణలు జరుగుతూనే ఉన్నాయని వివరించారు. బుధవారం 104 మంది భారతీయులను అమెరికా స్వదేశానికి తిప్పి పంపిన నేపథ్యంలో

..మిగతా 2 లో

# పల్లెల్లో సందడి..

- వారంలో పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్
- మార్చి మొదటి వారంలో ఎన్నికలు
- వేగంగా ఏర్పాట్లు చేస్తున్న ఎన్నికల సంఘం
- బీసీ రిజర్వేషన్లపై తేల్చేసిన సీఎం రేవంత్
- బ్యాలెట్ పేపర్లు సిద్ధం చేస్తున్న అధికారులు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల ఫీవర్ మొదలైంది. గ్రామాల్లో సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికలపై జోరుగా చర్చలు జరుగుతున్నాయి. ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆశావాహులు ఎదురు చూస్తున్నారు. మరో 15 రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ కానుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హింట్ ఇచ్చారు. తాజాగా.. రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక అప్డేట్ ఇచ్చింది. గ్రామ పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయి. పోలింగ్ కేంద్రాలు, బ్యాలెట్‌బాక్స్‌లు, బూత్‌లు సిద్ధం కాగా.. ఎన్నికల నిర్వహణపై మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ కూడా ప్రారంభించింది. పంచాయతీ కార్యదర్శులకు సెలవులు రద్దు చేస్తూ




ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అత్యవసరం అయితే ఆధార పత్రాలు ఉంటే సెలవులు మంజూరుచేయనున్నారు. కులగణనపై ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తూ అసెంబ్లీ కూడా నిర్వహించింది. బీసీ రిజర్వేషన్ల ఖరారుతోనే ఎన్నికలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వనుంది. ఈ క్రమంలోనే స్థానిక ఎన్నికల్లో

..మిగతా 2 లో

## తెలంగాణ సచివాలయంలో
# నకిలీ ఉద్యోగి హల్‌చల్

- పట్టుకున్న భద్రతా సిబ్బంది
- తహసీల్దార్ హోదాతో నకిలీ ఐడీ కార్డు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:



తెలంగాణ సెక్రటేరియట్‌లోకి నకిలీ తహసీల్దార్ వెళ్లేందుకు ప్రయత్నించిన ఘటన కలకలం రేపింది. తిప్పర్తి తహసీల్దార్ అని చెప్పి అంజయ్య అనే వ్యక్తి నకిలీ ఐడీ కార్డుతో సచివాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించాడు. సచివాలయ భద్రతా సిబ్బందికి అనుమానం వచ్చి వెంటనే అతడిని అడ్డుకున్నారు. తిప్పర్తి తహసీల్దార్ కార్యాలయానికి ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవడంతో అంజయ్య నకిలీ తహసీల్దార్ అని తెలిసింది. ఎస్‌టీఎఫ్( భద్రతా దళం) ఎస్సై ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సైఫాబాద్ పోలీసులు అంజయ్యను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అంజయ్య వచ్చిన వాహనంపై కూడా తహసీల్దార్, ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్

..మిగతా 2 లో



# బంగారం ధర రయ్ రయ్..

- 10 గ్రాముల ధర రూ.86 వేలకు
- లక్ష మార్క్ దాటుతుందా?

విశాలభారతి, నేషనల్ బ్యూరో:

బంగారం ధర రన్ రాజా రన్ అంటూ పట్టపగ్గాల్లేకుండా పరుగు పెడుతోంది. నెల రోజుల వ్యవధిలో

..మిగతా 2 లో

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శుక్రవారం,
07.02.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com
vishalabharathi Telugu Daily



# రాష్ట్రానికి రూ.176.5 కోట్లు

తరువాయి భాగం

మైల్‌స్టోన్ 2, ఇన్షియేటివ్ Bకు సంబంధించి మైల్‌స్టోన్ 1 కింద కార్యకలాపాలను పూర్తి చేసింది. దీంతో తెలంగాణ ఇన్షియేటివ్ ఏలో రూ.125 కోట్లు, ఇన్షియేటివ్ బీలో రూ.51.5 కోట్లు పొందేందుకు అర్హత కలిగి ఉంది.ఇనిషియేటివ్ Aకు సంబంధించి మైల్‌స్టోన్ 1 కోసం ఎంవీ పన్ను రాయితీని నోటిఫై చేసి అమలు చేసింది. దీని కింద మొత్తం అర్హత కలిగిన ప్రోత్సాహకం రూ.50 కోట్లు అని ఆర్డర్‌లో పేర్కొన్నారు. అలాగే ఇన్షియేటివ్ Aకు సంబంధించి మైల్‌స్టోన్ 2 కోసం కింద రాష్ట్ర ప్రభుత్వం 15 సంవత్సరాల కంటే పాత ప్రభుత్వ వాహనాలను స్క్రాప్ చేయడానికి ఒక ప్రణాళికను సమర్పించింది. దీని కింద మొత్తం అర్హత కలిగిన ప్రోత్సాహకం రూ.75 కోట్లు. ఇన్షియేటివ్ బీ సంబంధించి మైల్‌స్టోన్ 1 కోసం తెలంగాణకు జిల్లాల్లో ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లు (ఏటీఎస్) లభించాయి. 21 జిల్లాలు ప్రయారిటీగా తీసుకున్నందుకు రూ. 31.5 కోట్లు, అలాగే రూ. 20 కోట్లు ప్రయారిటీ లేని జిల్లాల కోసం ప్రోత్సాహకం అందిస్తుంది. దీంతో ఈ మైల్‌స్టోన్ కింద మొత్తం అర్హత కలిగిన ప్రోత్సాహకం రూ. 51.5 కోట్లు.

ఇదిలాఉంటే, హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ కింద రోడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని తెలంగాణ రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా హెడ్ క్వార్టర్స్‌కు లింక్ రోడ్లు లేకపోవడం, జిల్లా హెడ్ క్వార్టర్స్‌ను రాష్ట్ర రాజధానితో అనుసంధానించే రోడ్లు, ప్రస్తుత రహదారి మౌలిక సదుపాయాల అప్‌గ్రేడ్.. ఇలా మూడు విభాగాలుగా వర్గీకరించబడిన పనులను చేపట్టడంలో నియమాలను పాటించాలని ఆయన అధికారులను కోరారు. హెచ్ఏఎం రోడ్లకు సంబంధించిన వివరణాత్మక ప్రాజెక్ట్ నివేదికలను సిద్ధం చేయడానికి కన్సల్టెంట్లను గుర్తించాలని మంత్రి వారిని ఆదేశించారు. అధ్వాన్న స్థితిలో ఉన్న రోడ్లకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన అన్నారు.

# ప్రైవేటు ఆస్తులపై ప్రభుత్వ పెత్తనమేంది..?

తరువాయి భాగం

, మార్గదర్శకాలకు విరుద్ధంగా తీసుకున్న నిర్ణయాలు చెల్లుబాటు కావని స్పష్టం చేసింది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బాచుపల్లిలో 128 ఎకరాలు విక్రయించేందుకు ధరణి పోర్టల్లో స్లాట్ బుకింగ్‌కు అవకాశం లేకుండా నిలిపివేయడాన్ని సవాలు చేస్తూ వెంకటసుబ్బయ్య హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ సీవీ భాస్కర్ రెడ్డి విచారణ చేపట్టారు. పిటిషనర్ తరపు న్యాయవాది రవీందర్ రెడ్డి వాదనలు వినిపిస్తూ.. సాదా బైనామా కింద భూమి కొనుగోలు చేశారని తెలిపారు. 1992లో చట్టప్రకారం క్రమబద్ధీకరించుకున్నారని.. దీనికి సంబంధించి పట్టా కూడా జారీ అయిందన్నారు. పెట్టుబడి రాయితీ కింద ప్రభుత్వం అందించిన ప్రోత్సాహకాలు కూడా పొందారన్నారు. ఈ భూమిని విక్రయించడానికి రిజిస్ట్రేషన్ ఫీజు తదితరాలు ఈచలానా కింద రూ.30లక్షలకు పైగా చెల్లించి విక్రయం కోసం స్లాట్ బుక్ చేసుకోవాలనుకుంటే బ్లాక్ చేశారన్నారు. జుల్ఫికర్ అలీఖాన్ అనే వ్యక్తి ఇచ్చిన వినతి పత్రం ఆధారంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, భూపరిపాలన ప్రధాన కమిషనర్ రిజిస్ట్రేషన్ కాకుండా ఉత్తర్వులు జారీ చేశారన్నారు. సర్వే నంబరు 132, 133లో సాదాబైనామా కింద కొనుగోలు చేశారని సీసీఎల్ఏకు చెప్పడంతో ఎలాంటి నోటీసు ఇవ్వకుండా రిజిస్ట్రేషను నిలిపివేయాలని ఆదేశాలు ఇవ్వడం సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమన్నారు. రిజిస్ట్రేషన్లు నిలిపిసే అధికారం సీసీఎల్ఏకు లేదని తెలిపారు. సెక్షన్ 22ఏ జాబితాలో ఉన్నప్పుడుగానీ, కోర్టు ఉత్తర్వులుంటే తప్ప రిజిస్ట్రేషన్‌ను అడ్డుకోరాదన్నారు. ఇరువైపుల వాదనలను విన్న న్యాయమూర్తి ప్రైవేటు పట్టా భూములను రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22ఏ కింద నిషేధిత జాబితాలో చేర్చే అధికారం ప్రభుత్వానికి, అధికారులకు లేదని చట్టం స్పష్టంగా చెబుతోందన్నారు. పిటిషనర్‌కు చెందిన పత్రాలను పరిశీలించి నిబంధనల ప్రకారం ఉన్నట్లయితే రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఉత్తర్వుల కాపీ అందిన నాలుగు వారాల్లో పూర్తి చేయాలని ఆదేశిస్తూ న్యాయస్థానం విచారణను ముగించింది.

# తెలంగాణ సచివాలయంలో నకిలీ ఉద్యోగి హల్‌చల్

తరువాయి భాగం

అని స్టిక్కర్ ఉండటంతో పోలీసులు ఒక్కసారిగా కంగుతిన్నారు.ఇటీవలే ఇలాంటి ఘటన జరిగింది. ఓ వ్యక్తి నకిలీ ఐడీ కార్డుతో సచివాలయంలోకి ప్రవేశించి ఏకంగా సీఎంతో సెల్ఫీదిగేందుకు యత్నించాడు. అనుమానాస్పదంగా కనిపించడంతో సచివాలయ భద్రతా సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరోసారి ఇలాంటి ఘటన జరగడం చర్చనీయాంశమైంది.

# పల్లెల్లో సందడి..

తరువాయి భాగం

పోటీ పడడానికి అన్ని వర్గాలను పలకరిస్తూ ఆశావహులు తిరుగుతున్న తీరుతో పల్లెల్లో సందడి మొదలైంది.

**ఎన్నికల వైపు పార్టీల దృష్టి..**

గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ వేగంగా ఏర్పాట్లు పూర్తిచేస్తుండడంతో రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులను సన్నద్ధం చేయడానికి దృష్టి సారించాయి. అధికార పార్టీ కాంగ్రెస్‌కు స్థానిక ఎన్నికలు సవాల్‌గానే మారనున్నాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, రైతు భరోసా, ఆత్మీయభరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, మహాలక్ష్మీ పథకాలపై ఆశలు పెట్టుకున్నారు. గ్రామాల్లో రైతులు, మహిళలు, కాంగ్రెస్ మద్దతు ఇచ్చే అభ్యర్థులు ఓట్లు వేస్తారని భావిస్తున్నారు. 90 శాతానికి పైగా స్థానాలు గెలుచుకోవాలనే దానిపై దృష్టి సారించారు. మరోవైపు బీఆర్ఎస్, బీజేపీలు ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని సత్తా చాటాలని భావిస్తున్నాయి. గత ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు చెందినవారే స్థానిక సంస్థల్లో గెలుపొందారు. తిరిగి మళ్లీ స్థానాలను కైవసం చేసుకోవాలని గ్రామస్థాయి నాయకత్వాన్ని సిద్ధం చేస్తున్నారు.

**బ్యాలెట్ పేపర్లు సిద్ధం..**

గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన బ్యాలెట్ పేపర్లను కూడా అధికార యంత్రాంగం సిద్ధం చేసింది. సర్పంచ్ అభ్యర్థులకు 30 గుర్తులు, వార్డు సభ్యుల అభ్యర్థులకు 20 గుర్తులు కేటాయించారు. సర్పంచ్‌లకు సంబంధించి పింక్ కలర్ బ్యాలెట్ పత్రం, వార్డు సభ్యులకు తెలుపు రంగు బ్యాలెట్ పత్రాన్ని సిద్ధం చేస్తున్నారు. సర్పంచ్‌ల ఎన్నికల గుర్తుల్లో ఉంగరం, కత్తెర, ఫుట్‌బాల్, బ్యాట్, బ్యాట్స్‌మెన్, స్టంప్స్, లేడీ పర్స్, టీవీ రిమోట్, టూత్ పేస్ట్, పాన్, చెత్తడబ్బా, బెండకాయ, కొబ్బరి చెట్టు, వజ్రం, నల్ల బోర్డు, బకెట్, డోర్ హ్యాండిల్, చేతికర్ర, మంచం, బిస్కెట్, వేణువు, జల్లెడ, పలక, టేబుల్, బ్యాటరీ లైట్, బ్రష్, పడవ, చైన్, చెప్పులు, గాలిబుడగ తదితర గుర్తులు ఉన్నాయి. వార్డు సభ్యులకు సంబంధించి పొయ్యి, స్టూల్, బీరువా, గ్యాస్ సిలిండర్, గౌన్, ఈల, కుండ, గరాట, మూకుడు, డిష్‌యాంటీనా, ఐస్‌క్రీమ్, గాజు గ్లాస్, పోస్ట్ డబ్బా, కవర్, కటింగ్ ప్లేయర్, హాకీ, కర్రబంతి, నెక్ టై, విద్యుత్ స్తంభం, షటిల్, గుర్తులు కేటాయించారు. గుర్తుల్లో కొన్ని గుర్తుంచుకోవడం కష్టమే అన్నట్లుగా భావిస్తున్నారు.

# పార్టీ మారిన ఎమ్మెల్యేలపై వేటు పక్కా

**తరువాయి భాగం:** ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు అన్యాయం జరుగుతుందన్నారు.సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజాస్వామ్య హక్కులను హరించేలా కొన్ని నిబంధనలు ఉన్నాయని అన్నారు. గవర్నర్లకు అధికారాలు కట్టబెడుతూ రాష్ట్రాల పరిధిలోని యూనివర్సిటీల్లోని నియామకాల్లో రాష్ట్ర ప్రభుత్వ పాత్ర లేకుండా చేసే ప్రయత్నం జరుగుతోందన్నారు. వైస్ ఛాన్స్‌లర్ ఎంపికలో నిపుణులు ఉండేలా పారదర్శకంగా ఉండాలని సూచించామని అన్నారు. తమ అభిప్రాయాలు యూజీసీకి సైతం చెప్పామన్నారు. మరో మంత్రి నితిన్ గడ్కరీను కూడా కలిసి సిరిసిల్లతో ముగుస్తున్న NH365Bను రైల్ కమ్ రోడ్ బ్రిడ్జి కట్టి కోరుట్ల వరకు పొడిగించాలని కోరామని కేటీఆర్ చెప్పారు.

# గీత దాటితే వేటే..



తరువాయి భాగం

మీడియాతో మాట్లాడిన మున్షీ.. ఏదైనా సమస్య ఉంటే నాలుగు గోడల మధ్య మాట్లాడుకోవాలని.. ఎమ్మెల్యేలు రహస్య సమావేశాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని బహిరంగంగానే వార్నింగ్ ఇచ్చారు. ఎమ్మెల్యేలకు, కార్యకర్తల మధ్య గ్యాప్ ఉందంటూ మున్షీ వ్యాఖ్యానించటం ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

**స్థానిక ఎన్నికలపై దిశానిర్దేశం**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలని సీఎం రేవంత్ రెడ్డి ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు. అత్యధిక గ్రామాలు ఏకగ్రీవం చేసే బాధ్యత ఎమ్మెల్యేలదేనని స్పష్టం చేశారు. గ్రామాల్లో హామీల అమలుకు ముందడుగు వేయాలని, సీసీ రోడ్లు, ఆలయాలు, నిర్మాణ అనుమతులకు, నిధుల మంజూరు కోసం మంత్రులను కలవాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. బీసీలకు 42 శాతం స్థానిక సంస్థల పదవులను కేటాయించే బాధ్యత ఎమ్మెల్యేలదేనని చెప్పారు. మంత్రులు, ఎమ్మెల్యేలు కలిసి పనిచేయాలని.. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పార్టీలో కొత్త, పాత నేతలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న హామీల అమలును క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని సీఎం ఎమ్మెల్యేలకు సూచించినట్లు తెలుస్తోంది. గ్రామాల్లో అభివృద్ధి పనులకు సంబంధించి నిధుల కోసం మంత్రులను కలవాలని చెప్పినట్లు సమాచారం. ప్రతిపక్షాలు చేస్తున్న ప్రచారాన్ని ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని స్పష్టం చేసినట్లు ఎమ్మెల్యేలు తెలిపారు. పార్టీ నేతలు, క్యాడర్ అందరూ ఒకే తాటిపై నిలిచి పనిచేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం మరింత బలపడుతుందని అభిప్రాయపడ్డారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల విజయమే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో మరింత దృఢంగా నిలిచేలా చేస్తుందని, అందుకే ప్రతి నియోజకవర్గం స్థాయిలో సమర్థవంతమైన ఎన్నికల ప్రణాళికలు రూపొందించాలన్నారు. ప్రజలకు చేరువగా ఉంటూ ప్రభుత్వ పథకాలను గట్టిగా ప్రచారం చేయాలని ఎమ్మెల్యేలకు సూచించారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా పథకాలపై ప్రతిపక్షాలు లేని పోని అపోహలు సృష్టిస్తున్నాయని, అదే స్థాయిలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కూడా కౌంటర్ ఇవ్వాలని సూచించినట్టు సమాచారం.

# రాష్ట్రంలో రెండు భారీ సభలు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

ఫిబ్రవరి నెలలో రెండు భారీ బహిరంగ సభలు నిర్వహించ తలపెట్టామని పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్‌తెలిపారు. గజ్వేల్‌లో ఎస్సీ వర్గీకరణ సభ, సూర్యాపేటలో బీసీ కుల గణన బహిరంగ సభలు నిర్వహించనున్నామన్నారు. బహిరంగ సభలకు ఏఐసీసీ అగ్రనేతలకు రాహుల్‌గాంధీ, మల్లిఖార్జున ఖర్గేలను ఆహ్వానించేందుకు ఢిల్లీకి వెళుతున్నామని చెప్పారు. గురువారం ఎంసీహెచ్ఆర్‌డీలో నిర్వహించిన సీఎల్పీ సమావేశం అనంతరం మీడియాతో పీసీసీ చీఫ్‌మాట్లాడారు. స్థానిక సంస్థల గెలుపే లక్ష్యంగా దాదాపు ఐదున్నర గంటల పాటు సీఎం రేవంత్‌రెడ్డి అధ్యతన సమావేశం జరిగిందని పేర్కొన్నారు. ఇందులో స్థానిక సంస్థల ఎన్నికలు, ఎస్సీ వర్గీకరణ, కుల గణన సర్వే, బడ్జెట్ అంశాలపై ప్రధానంగా చర్చించామని ఆయన తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికల వ్యూహం, ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలపై చర్చించామన్నారు. ఎమ్మెల్యేలు కూడా వారి అభిప్రాయాలను వెల్లడించారన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని, కులగణనపై విపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తు



న్నాయని, వారి దుష్ప్రచారాలను తిప్పికొట్టాలని సూచనలు చేయడం జరిగిందన్నారు. పీసీసీ కార్యవర్గంపై సలహాలు తీసుకున్నాం. పార్టీ నిర్మాణం, పథకాల అమలుపై పరిపూర్ణంగా చర్చించామని పీసీసీ చీఫ్ తెలిపారు. రాష్ట్ర ఆదాయం, అప్పులు, వ్యయంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ద్వారా వివరించడం జరిగిందన్నారు. సీఎం, దీపా దాస్ మున్షీతో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ముఖాముఖి భేటీ అయ్యారన్నారు. ప్రధానంగా ఎమ్మెల్యేలకు ఉన్న అనుమానాలను నివృత్తి చేశామన్నారు. వర్గీకరణ, కులగణన ప్రచారానికి ఎమ్మెల్యేలు, డీసీసీలకు దిశానిర్దేశం చేశామని పీసీసీ చీఫ్‌ఈ సందర్భంగా తెలిపారు.



# బంగారం ధర రయ్ రయ్..

తరువాయి భాగం

ఏకంగా 8 వేలు పెరిగింది. 24క్యారెట్లు 10 గ్రాముల బంగారం ధర ఇవాళ 86 వేలు దాటింది. ఈ దూకుడు ఇంతటితో ఆగుతుందా? లక్ష మార్క్‌ను టచ్ చేస్తుందా? అసలే మాఘమాసం.. తెలుగురాష్ట్రాల్లో మార్చి 26 వరకు లక్షలాది వివాహాలు జరగనున్నాయి. ఈ క్రమంలో పెరిగిపోతున్న బంగారం ధరలు చూసి ఆడపిల్లల తల్లిదండ్రులు తలలు పట్టుకుంటున్నారు. అమెరికాలో ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టాక యూఎస్ డాలర్ బలపడుతోంది. విదేశీ ఇన్వెస్టర్లు ఇండియాలో పెట్టుబడుల్ని ఉపసంహరించుకుంటున్నారు. దీంతో దేశీయ స్టాక్‌మార్కెట్లు నష్టాల బాటలో పయనిస్తున్నాయి. ఇదే సమయంలో దేశీయ ఇన్వెస్టర్లు బంగారంపై పెట్టుబడులు పెడుతున్నారు. దీంతో గోల్డ్ రేట్లు పెరుగుతున్నాయంటున్నారు ఎక్స్‌పర్ట్స్. ముందు ముందు 10 గ్రాముల బంగారం ధర లక్ష దాటినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదంటున్నారు. వెండి ధర కూడా లక్షకు చేరుకుంటుంది. కొన్ని రాష్ట్రాల్లో అయితే లక్ష 10 వేల రూపాయలకు చేరువలో ఉంది. బడ్జెట్‌కు ముందు నుంచే బంగారం, వెండి ధరలు వేగంగా పెరుగుతున్నాయి. ఇన్వెస్టర్లు, సాధారణ కొనుగోలుదారుల నుంచి డిమాండ్ పెరగడంతో బంగారం ధరలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా అంతర్జాతీయ మార్కెట్‌లో అస్థిరత, అమెరికన్ విధానాల కారణంగా ప్రజలు సురక్షితమైన పెట్టుబడిగా బంగారం కొనుగోలును పెంచుతున్నారు. దీని కారణంగా దాని ధర నిరంతరం పెరుగుతోంది. వడ్డీరేట్లను తగ్గించడంతోపాటు ప్రపంచ మార్కెట్‌లో అనిశ్చితి కొనసాగితే బంగారం, వెండి ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. అలాగే, వివాహాలు, పండుగ సీజన్లలో వారి డిమాండ్ ఎక్కువగా ఉండవచ్చు, దీని కారణంగా అధిక స్థాయిలో ఉండవచ్చు.

## చేతులకు బేడీలు, కాళ్లకు గొలుసులు
# భారత్‌కు వచ్చే వరకూ అంతే

తరువాయి భాగం

రాజ్యసభలో గురువారం ప్రకటన చేశారు విదేశాంగ మంత్రి.అక్రమ వలసలను అరికట్టేందుకు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నామని జైశంకర్ తెలిపారు. వలసల సమయంలో చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. అన్ని దేశాల అక్రమ వలసదారులను అమెరికా వెనక్కి పంపించేస్తోందన్నారు. ఇతర దేశాల్లో తమ పౌరులు చట్టవిరుద్ధంగా ఉంటే వారిని స్వదేశాలకు తీసుకెళ్లిపోవడం అన్ని దేశాల ప్రభుత్వాల బాధ్యత అని వివరించారు. అక్రమ వలసదారుల తరలింపును అమెరికా కస్టమ్స్ ఎన్‌ఫోర్స్ మెంట్ అథారిటీ ICE అమలు చేసిందని వెల్లడించారు. తరలిస్తున్న వలసదారుల పట్ల ఎలాంటి అవాంఛిత ఘటనలు జరగకుండా చూసేందుకు అమెరికా ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు. భారతీయులకు బేడీలు వేయడంపై విపక్షాలు ఆందోళనకు దిగాయి.

**11 రోజుల కస్టడీ**

భారత్ తిరిగొచ్చిన 104 మంది అక్రమ వలసదారుల్లో జస్పాల్ సింగ్ ఒకరు. తనను అమెరికాలో పట్టుకున్న తర్వాత చేతులకు బేడీలు, కాళ్లకు గొలుసులు వేసి బంధించారని, అమృత్‌సర్ ఎయిర్‌పోర్టుకు వచ్చేవరకు అవి అలాగే ఉన్నాయని విలపిస్తూ తెలిపాడు. గురుదాస్‌పుర్‌కు చెందిన 36ఏళ్ల జస్‌పాల్ జనవరి 24న మెక్సికో సరిహద్దు దాటిన వెంటనే అమెరికా పెట్రోలింగ్ పార్టీకి దొరికిపోయాడు. 30 లక్షలు ఇస్తే అమెరికా పంపిస్తానంటూ మాయమాటలు చెప్పిన ఏజెంట్ మోసంచేసి బ్రెజిల్ గుండా తరలించాడు. 6 నెలలు బ్రెజిల్‌లో ఉండాల్సి వచ్చిందని జస్పాల్ చెప్పాడు. జస్పాల్‌ను అరెస్టు చేసిన అమెరికా పోలీసులు 11రోజులు కస్టడీలో ఉంచుకొని ఆ తర్వాత వెనక్కి పంపారు.

# రాష్ట్రంలో పవర్ డిమాండ్

- రోజురోజుకూ పెరుగుతున్న ఎండలు
- గురువారం రికార్డు స్థాయిలో 15,752 మెగావాట్ల డిమాండ్
- స్పష్టం చేసిన విద్యుత్ శాఖ

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

తెలంగాణ రాష్ట్రంలో ఇవాళ అత్యధికంగా రికార్డ్ స్థాయిలో 15,752 మెగావాట్ల డిమాండ్ నమోదైంది. గత ఏడాది మార్చి 8న అత్యధికంగా 15,623 మెగావాట్ల డిమాండ్‌ను అధిగమించినట్లు విద్యుత్‌శాఖ ప్రకటించింది. వ్యవసాయానికి, పరిశ్రమలకు విద్యుత్ వినియోగం పెరగడంతో పాటు గృహవినియోగం భారీగా పెరగంతోనే విద్యుత్ డిమాండ్ నమోదు అవుతుందని విద్యుత్ శాఖ అంచనావేస్తుంది. ఈ ఏడాది విద్యుత్ డిమాండ్ 17,000ల మెగావాట్లకు చేరుకుంటుందని విద్యుత్ శాఖ అంచనావేస్తుంది. విద్యుత్ డిమాండ్ ఎంత పెరిగినా అందుకు తగ్గట్లు ఏర్పాట్లు చేస్తున్నామని విద్యుత్ శాఖ స్పష్టం చేసింది.రాష్ట్ర వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు భారీగా పెరిగిపోతున్నాయి. ఫిబ్రవరిలోనే ఎండలు దంచికొడుతున్నాయి. ఉష్ణోగ్రతలు పెరిగిపోవడంతో పాటు ఫ్యాన్లు, ఏసీలు, కూలర్ల వినియోగం భారీగా పెరిగిపోతుంది. ఒకపక్క యాసంగి పంటలకు సైతం విద్యుత్ వినియోగిస్తున్నారు. మరో పక్క పరిశ్రమలకు వినియోగం భారీగా పెరిగిపోయింది. గృహవినియోగం కూడా భారీగానే పెరిగిపోయినట్లు విద్యుత్ శాఖ అంచనావేస్తుంది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా రికార్డ్ స్థాయిలో విద్యుత్ వినియోగం నమోదు అవుతుందని విద్యుత్ శాఖ భావిస్తుంది. గత ఏడాది డిసెంబర్ నెలలో 12,666 మెగావాట్లు నమోదు కాగా, ఈ ఏడాది డిసెంబర్‌లో 14,375 మెగావాట్ల విద్యుత్ డిమాండ్‌కు చేరుకుంది. గత ఏడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది 13.49శాతం విద్యుత్ అధికంగా పెరిగిందని విద్యుత్ శాఖ భావిస్తుంది. గత ఏడాది జనవరిలో 13,810 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదైతే ఈ ఏడాది 15,205 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదైంది. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది అదనంగా 10.10శాతం డిమాండ్ పెరిగింది. రాష్ట్రంలో విద్యుత్ వినియోగం కూడా భారీగానే పెరిగిపోతుంది. గత ఏడాది డిసెంబర్ లో 207.68 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరిగితే ఈ ఏడాది డిసెంబర్ లో 235.25 మిలియన్ యూనిట్ల వినియోగం జరిగింది. గత ఏడాదితో పోల్చితే 13.28శాతం పెరిగింది. ఈ ఏడాది జనవరిలో 243.12 మిలియన్ యూనిట్ల డిమాండ్ ఉంటే ఈ ఏడాది జనవరిలో 260.56 మిలియన్ యూనిట్ల డిమాండ్‌కు పెరిగింది. గత ఏడాదితో పోలిస్తే 7.17శాతం అదనంగా పెరిగినట్లు విద్యుత్ శాఖ అధికారులు అంచనావేస్తున్నారు.ఉత్పత్తి సంస్థల విద్యుత్ యూనిట్‌కు రూ.4.50 ఉన్న సమయంలో రూ.2.72కే ఎక్స్ఛేంజీల నుంచి విద్యుత్ కొనుగోలు చేయడం ద్వారా విద్యుత్ సంస్థలు భారీగా ఆదా చేసినట్లు ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణభాస్కర్ తెలిపారు. తక్కువ ధరకే ఎక్స్ఛేంజీల ద్వారా విద్యుత్ కొనుగోలు చేయడంతో గడిచిన 13 నెలల్లో విద్యుత్ సంస్థలకు వెయ్యికోట్ల రూపాయల వరకు ఆదా అయినట్లు ఆయన పేర్కొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శుక్రవారం,
07.02.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com




## జాతర స్థలాన్ని పరిశీలించిన సింగరేణి అధికారులు

**మణుగూరు, విశాలభారతి:**

మండల సమీపంలోని రేగుల గండి అటవీ ప్రాంతంలో నిర్వహించే శ్రీ భవాని లింగ మంతుల జాతర స్థలాన్ని గురువారం నాడు సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా అధికారులు ఎస్ఓటు జిఎం శ్యాంసుందర్, ఏరియా ఇంజనీర్ శ్రీనివాస్ ఇతర అధికారులు గురువారం పరిశీలించారు. రేగుల గండి చెరువు దగ్గర నుండి జాతర జరుగు గుడి వరకు ఉన్న రోడ్డుకు తాత్కాలికంగా మరమ్మతులు చేశారు. జాతర సమయంలో మంచినీటి వసతి, లైటింగ్ సదుపాయాలను జాతర కంటే ముందు రోజే తప్పనిసరిగా కల్పిస్తామని హామినిచ్చారు. ఈ సందర్భంగా లింగమంతుల జాతర కార్యనిర్వాహన కమిటీ సభ్యులు అక్కడ వసతుల గురించి, గుడి పరిసర ప్రాంతాలలో తగిన సదుపాయాల గురించి అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్లు, సూపర్వైజర్లు సైదులు, ప్రవీణ్, అజయ్, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

## జాతీయ రహదారిపై ఇంధన చోరీ

**నర్సింహులుపేట, విశాలభారతి:**


మండలంలోని పెద్ద నాగారం స్టేజి గోపా తండ శివారు ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు సమీపాన ఖమ్మం టు వరంగల్ జాతీయ ప్రధాన రహదారిపై రామగుండం నుండి ఖమ్మం కు డెస్ట్ అన్లోడ్ చేసి వస్తు డ్రైవర్ అలసటకు గురికావడంతో అర్ధరాత్రి 12 గంటల సమయాన రోడ్డుకు సమీపాన సమీపాన పార్కింగ్ ప్రదేశంలో పెట్టి నిద్రపోవడం జరిగింది బుధవారం తెల్లవారుజామున 4 గంటలకు లేచి వాహనము చూసుకోగా సుమారు 300 నుంచి 350 లీటర్ల వరకు డీజిల్ దొంగలించడం జరిగిందని గ్రహించడంతో దీని విలువ సుమారు 35 నుండి 40 వేల ఉంటుందని లారీ డ్రైవర్ నరసింహులు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

## ఎల్బీనగర్ ఘటనపై జీహెచ్ఎంసీ సీరియస్.. అనుమతులు రద్దు

**ఎల్బీనగర్ ,విశాలభారతి:**

ఎల్బీనగర్ సెల్లార్ కుంగిన ఘటనపై జీహెచ్ఎంసీ (GHMC) సీరియస్ అయ్యింది. భవన నిర్మాణ అనుమతులను బల్దియా రద్దు చేసింది. సెట్ బ్యాక్ లేకుండా అపార్ట్మెంట్‌ను నిర్మిస్తున్నారని.. బారికేడింగ్, రిటర్నింగ్ వాల్ లేకుండానే సెల్లార్ తవ్వకం జరిగిందని తేలింది. అసలు జీహెచ్ఎంసీ అధికారులకు సమాచారం ఇవ్వకుండా తవ్వకాలు జరిపారని.. ముగ్గురు మృతికి కారణమయ్యారంటూ బిల్డర్‌పై క్రిమినల్ కేసు పెట్టింది జీహెచ్ఎంసీ. జాగ్రత్తలు పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన కారణంగా జీహెచ్ఎంసీ ఈ కేసు పెట్టింది. అలాగే బిల్డర్‌కు జీహెచ్ఎంసీ షోకాజ్ నోటీసు జారీ చేసింది.ఎల్బీనగర్‌లోని సెల్లార్ లోపల పనిచేస్తుండగా పైనుంచి మట్టిదిబ్బలు కూలి ముగ్గురు కూలీలు మృతి చెందిన ఘటనలో ఓనర్ కుస్మా రమేష్‌పై 106(1) 125(a) బీఎన్ఎస్ సెక్షల కింద ఎల్బీనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. మృతులు రాము, వీరయ్య, వాసు





మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా హాస్పిటల్‌కు తరలించగా.. గాయపడిన బిక్షపతి ఎల్బీనగర్‌లోని కామినేని హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. ప్రస్తుతం శరీరంలో అక్కడక్కడ కొన్ని గాయలతో నిలకడగానే బిక్షపతి ఆరోగ్యం ఉన్నట్లు తెలుస్తోంది. పేదవారు కావడంతో కనీసం హాస్పిటల్ బిల్లు కూడా కట్టలేని పరిస్థితిలో బిక్షపతి కుటుంబం ఉంది.

**ఆందోళన...**

మరోవైపు ఘటనా స్థలం వద్ద మృతుల కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. ఉస్మానియా ఆసుపత్రిలో పోస్టుమార్టం పూరైనా మృతదేహాలను ఇవ్వకుండా బిల్డర్ అడ్డుకుంటున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు గాయపడిన వారికి నష్టపరిహారం ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారు.కాగా.. ఎల్బీనగర్‌లోని మన్సూరాబాద్ చంద్రపురి కాలనీలో జరిగిన ప్రమాదంలో ముగ్గురు కూలీలు దుర్మరణం చెందగా, ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. సెల్లార్ తవ్వకాలు జరుపుతున్న సమయంలో ఓ వైపు నుంచి ఒక్కసారిగా మట్టిదిబ్బలు కూలాయి. ప్రమాద సమయంలో పలువురు కూలీలు అక్కడే ఉన్నారు. అయితే ప్రమాదం జరిగిన వెంటనే కొంత మంది కూలీలు పక్కకు జరిగి ప్రాణాలు కాపాడుకోగా.. నలుగురు కూలీలు మాత్రం మట్టిదిబ్బల కింద పడిపోయారు. వెంటనే సహాయ చర్యలు చేపట్టినప్పటికీ మట్టిదిబ్బల కింద ఊపిరాడక ముగ్గురు కార్మికులు మృతి చెందగా..మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో ఇద్దరు తండ్రీకొడుకులు కాగా.. మరొకరు మేనల్లుడు. ఒకే కుటుంబానికి చెందిన వారు మృతి చెందడంతో ఆ ప్రాంతంలో విషాదఛాయలు అలముకున్నాయి.




## సిద్ధార్థ మృతికి కారణమైన వారిని శిక్షించాలి

**తొర్రూరు, విశాలభారతి:**

సిద్ధార్థ మృతికి కారకులైన బాలాజీ నర్సింగ్ హోమ్, సరస్వతి హాస్పిటల్ లైసెన్లను రద్దు చేయాలని పిడిఎస్యు మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బానోత్ దేవేందర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తొర్రూరు పట్టణ కేంద్రంలోని బాలాజీ నర్సింగ్ హోమ్ లో ఇంజక్షన్ వికటించి తొమ్మిదవ తరగతి చదువుతున్న బాలుడు సిద్ధూకు ఎక్కువ డోసు ఇవ్వడంతో బాలుడు సిద్ధు మరణించాడు. సిద్ధార్థ మరణానికి కారపులైన బాలాజీ నర్సింగ్ హోమ్ సరస్వతి హాస్పిటల్ లైసెన్సు తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మండలంలోని కంఠయపాలెం గ్రామానికి చెందిన దాసరోజు సిద్ధార్థ అదే గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. జ్వరంతో బాధపడుతున్న సిద్ధార్థ ని చికిత్స నిమిత్తం తల్లి పట్టణంలోని బాలాజీ నర్సింగ్ హోమ్ కీ తీసుకొని రావడంతో డాక్టర్లు పరిశీలించి పరీక్షలు నిర్వహించి ఎక్కడోస్ ఇంజక్షన్ ఇచ్చారు. దాంతో క్షణాలలో మృతి చెందినట్లు తెలిపారని డాక్టర్ ఎక్కువ డోసు ఇంజక్షన్ ఇవ్వడంతో బాలుడు శ్వాస ఆడక మృతి చెందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్ధు, వినేష్, ప్రకాష్, కృష్ణ, ప్రమోద్, వంశీ, అభిలాష్, తదితరులు పాల్గొన్నారు.

## తాళ్ళపెల్లి ఉదయ్ భౌతికకాయానికి నివాళులు

**దేవరుప్పల విశాలభారతి:**



సింగరాజుపల్లి గ్రామంలో గురువారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో తాళ్ల పెల్లి ఉదయ్ మరణించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ జిల్లా నాయకుడు పల్లా సుందర్ రాంరెడ్డి వారి ఇంటికి వెళ్ళి పరామర్శించి రూ .25 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మేకపోతుల నరసింహ గౌడ్,నియోజకవర్గ యుత్ అధ్యక్షుడు గడ్డం రాజు,ఏఎంసీ డైరెక్టర్ కుతాటి నరసింహులు, మండల యూత్ నాయకుడు బానోత్ నవీన్ నాయక్,మండల నాయకులు కత్తుల విజయ్ కుమార్ రెడ్డి, కత్తుల సోమిరెడ్డి,అన్నారపు స్వరూపా యాదగిరి,నోముల వీరన్న,గ్రామ పార్టీ ప్రధాన కార్యదర్శి మేడరాజు తదితరులున్నారు.



## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన డిప్యూటీ డిఎంహెచ్ఓ

**నూతనకల్, విశాలభారతి:**

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డిఎం హెచ్ఓ గాజుల చంద్రశేఖర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని అన్ని రకాల రికార్డ్స్ ను తనిఖీ చేశారు.హైపర్ టెన్షన్,డయాబెటిస్,క్యాన్సర్ కేసుల వివరాలను, అభా కార్డ్స్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈనెలలో జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా 1 నుండి 19 సంవత్సరాల వయస్సు కలిగిన పిల్లలందరికీ నులిపురుగుల నివారణ మాత్రలు అందేలా జాగ్రత్తలు వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పిఓఎన్ సిడి,మండల వైద్యాధికారి ఆశ్రిత రెడ్డి, సిహెచ్ఓ చరణ్ నాయక్, ఎస్ ఓ వీరయ్య, హెచ్ ఇ ఓ సాంబశివరావు, పిహెచ్ఎన్ తారమ్మ, హెచ్ ఎస్ చిన్ని, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## లయోలా మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పై పోక్సో కేసు నమోదు

- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన అమానుష ఘటన
- మైనర్ బాలికపై అత్యాచారయత్నం
- ఇబ్రహీంపట్నంలో గురువారం వెలుగులోకి వచ్చిన సంఘటన

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:**



విద్యార్థుల జీవితాలను ఉద్ధరించాల్సిన ప్రధానోపాధ్యాయుడే కీచకుల్లా మారిపోయాడు. విద్యాబుద్ధులు నేర్పించి సమాజంలో మంచి చెడు గురించి చెప్పాల్సిన అతడే కామాంధుడిగా మారాడు. ఈ సంఘటన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఇబ్రహీంపట్నంలో లయోలా మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ గా పనిచేస్తున్న దినావణరావు అదే పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థిని పై బుధవారం అత్యాచారయత్నం చేశాడు. సాయంత్రం ఆరు ఇంటికి వెళ్ళిన బాలిక తన తల్లితో విషయం చెప్పగా పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. ప్రిన్సిపాల్ పై పోక్సో కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. గతంలోనూ విద్యార్థినిలను లోబర్చుకొని అత్యాచారం చేసినట్లుగా ఆరోపణలు ఉన్నాయి. దీనిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు



## ఘనంగా ప్రారంభమైన పోలీస్ అన్యువల్ గేమ్స్ స్పోర్ట్స్ మీట్

- ప్రారంభించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

**కొత్తగూడెం, విశాలభారతి:**

జిల్లా పోలీసుల అన్యువల్ గేమ్స్ స్పోర్ట్స్ మీట్ 2025 ను హేమచంద్రపురం హెడ్ క్వార్టర్స్ నందు గురువారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పతాక ఆవిష్కరణ చేసి ఘనంగా ప్రారంభించారు. జిల్లాలోని సబ్ డివిజన్ కు చెందిన డార్ హెడ్ క్వార్టర్స్, కొత్తగూడెం, ఇల్లెందు, పాల్వంచ, భద్రాచలం, మణుగూరు, డిపిఓ అండ్ స్పెషల్ వింగ్స్, హోంగార్డ్స్ వింగ్స్, విభాగాల కు చెందిన స్పోర్ట్స్ జట్లు నుండి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు గౌరవ వందనం స్వీకరించారు. శాంతి పావురాలను ఎగురవేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం సిబ్బందితో స్పోర్ట్స్ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈ స్పోర్ట్స్ మీట్ మూడు రోజుల పాటు 6,7, 8 తేదీల పాటు నిర్వహించినట్లు తెలిపారు. స్నేహపూర్వ వాతావరణం లో ఆటలు కొనసాగించాలని కోరారు. గెలుపు ఓటములు సహజమని అన్నారు. ఈ గేమ్స్ వల్ల పనిలో ఒత్తిడిని తగ్గించుకోవచ్చన్నారు. మానసికంగా, ఆరోగ్యంగా మన ఫిట్నెస్ ని పొందవచ్చు అన్నారు. పాల్వంచ మరియు హోంగార్డ్స్ వాలీబాల్ పోటీని ఎస్పీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఏఎస్పి విక్రత్ కుమార్ సింగ్ , డిఎస్పి అబ్దుల్ రెహమాన్, చంద్రబాను, సతీష్, రవీందర్ రెడ్డి, సిఐలు ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.



## మహిళల ఆరోగ్యమే లక్ష్యం

- డాక్టర్ దుర్గ భవాని

**పినపాక, విశాలభారతి:**

మహిళల ఆరోగ్యమే లక్ష్యంగా ప్రసవానంతర వైద్యసేవల కోసం రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ 'అమ్మ కోసం' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని పినపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు దుర్గా భవాని తెలియజేశారు. గురువారం పినపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అమ్మకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రసవానంతరం తక్షణం వచ్చే ఇన్ఫెక్షన్లు, కాళ్ల వాపు, నొప్పులు, ఇతర సమస్యలు, మానసిక ఆరోగ్య సమస్యలకు పరిష్కారం చూపుతామని తెలిపారు. ప్రసవం తర్వాత కొంత ఆలస్యంగా వచ్చే ఆరోగ్య సమస్యలపైనా ప్రత్యేక శ్రద్ధ ఉంటుందని తెలిపారు. అమ్మ కోసం కార్యక్రమం ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు, ఆసుపత్రుల ద్వారా అమలవుతుందని మహిళలను ఏడాదిపాటు పర్యవేక్షిస్తూ సమస్యలుంటే వైద్యం అందిస్తామని జాతీయ ఆరోగ్య మిషన్ లో భాగంగా ఈ కార్యక్రమాన్ని అమలు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయిలో కులగణన చేపట్టాలి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

కులగణనపై కీలక వ్యాఖ్యలు చేశారు బీజేపీ ఎంపీ ఆర్. కృష్ణయ్య. పార్లమెటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని.. జాతీయస్థాయిలో కులగణన చేపట్టాలని అన్నారు. బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని, కేంద్ర బడ్జెట్ లో బీసీలకు 51వేల కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు కృష్ణయ్య. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కులగణనను బీజేపీ ఎంపీలు తప్పుబట్టారని అన్నారు కృష్ణయ్య. పంచాయితీ రాజ్ చట్టాన్ని సవరించాలని.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్లకు చట్టబద్దత కల్పించకపోతే ఉద్యమిస్తామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కులగణనలో చాలా తప్పులున్నాయని.. అనేక కుటుంబాలు ఈ సర్వేలో పాల్గొనలేదని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని.. బీసీ నేతలతో తనను తిట్టించి దృష్టి మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శుక్రవారం,
07.02.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com


vishalabharathi Telugu Daily

## మృతుని కుటుంబానికి 50 కిలోల బియ్యం సహాయం

మునుగోడు,విశాలభారతి:

సోలిపురం గ్రామానికి చెందిన కొమ్మనపల్లి మారయ్య కుటుంబానికి గురువారం బిఆర్ ఎస్ యువజన నాయకుడు నకిరేకంటి మురళి 50 కేజీల బియ్యాన్ని అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవ్వరికీ ఎప్పుడు ఎలాంటి ఆపద వచ్చిన నేను ఉన్నాను అంటూ ప్రజలకు హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో ఇరిగి యాదయ్య మాజీ సర్పంచ్, మిడిపల్లి లింగయ్య మాజీ సర్పంచ్, నకరికంటి నరసింహ మాజీ సర్పంచ్, మిడిపల్లి రాజయ్య మాజీ ఉపసర్పంచ్, మిడిపల్లి శివ, బర్ల మహేష్, బాలగోని రాకేష్, భూతరాజు ఇస్తారి తదితరులు పాల్గొన్నారు.





## ప్రతి ఒక్కరు సేవాభావాన్ని అలవర్చుకోవాలి.

- మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్.
- పిసిసి సభ్యులు కొప్పుల వేనారెడ్డి దంపతుల పెళ్లిరోజు సందర్భంగా.
- ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో అన్న ప్రసాద వితరణ

సూర్యాపేట,విశాలభారతి:

ప్రతి ఒక్కరు సేవాభావాన్ని అలవర్చుకోవాలని మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్ అన్నారు.గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పీసీసీ సభ్యులు పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేనా రెడ్డి దంపతుల పెళ్లిరోజు సందర్భంగా పబ్లిక్ క్లబ్ ఈసీ మెంబర్ రాచకొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో రోగుల సహాయకులకు 200 మందికి అన్నప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ మంత్రి సూర్యాపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి రామ్ రెడ్డి దామోదర్ రెడ్డి ప్రియ శిష్యునిగా కొప్పుల వేనారెడ్డి సుదీర్ఘకాలంగా నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రుద్రంగి రవి, సాజిద్, కొత్త పవన్, సైదులు, అడ్వకేట్ బత్తిని వెంకటేశ్వర్లు, భానుపురి సేవా బృందం సభ్యులు శ్రీరంగం రాము, వెంపటి శబరి, దోగుపర్తి సతీష్, బికుమల్ల కృష్ణ, తెరటపల్లి సతీష్, తదితరులు పాల్గొన్నారు.

# సామాన్యుడుని మోసం చేసిన కేంద్ర బడ్జెట

- 50 లక్షల కోట్లకు పైగా బడ్జెట్ లో సంపన్నులకు పెద్దపీట
- ఎండీ జహంగీర్సీ సీపీఎం రాష్ట్ర కార్యవర్గసభ్యులు

చౌటుప్పల్ విశాలభారతి:




పట్టణ కేంద్రంలోని కందాల రంగారెడ్డి స్మారక భవనంలో సిపిఎం చౌటుప్పల్ మండల కమిటీ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ జహంగీర్ విచ్చేసి ప్రధాని అందరం వారు మాట్లాడుతూ బీమా రంగంలో 100శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అవకాశం ఇచ్చి పూర్తిగా జీవిత బీమాను ప్రైవేటీకరణ చేశారు. ఉపాధి హామీ నిధులు 83 వేల కోట్లకు కుదించి క్రమేపి ఉపాధి హామీని ఎత్తివేసుకుంట్రా బిజెపి చేస్తుందని, వ్యవసాయ రంగానికి గతం కన్నా పదివేల కోట్లు తగ్గించారని ఎరువుల సబ్సిడీకి 11 వేల కోట్ల కోత విధించారని,దళితులకు 16శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా 5శాతం శాతం కేటాయించాని,గిరిజనల్ కేవలం 2 శాతం నిధులు కేటాయించారని, మైనార్టీలకు 0.06 నిధులు కేటాయించారని ఆయన అన్నారు. తెలంగాణలో బిజెపికి ఎనిమిది మంది ఎంపీలు ఉన్న ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్న తెలంగాణకు నిధులు రాబట్టడంలో విఫలం అయ్యారు. మూసి పునర్జీవం, గోదావరి జిల్లాల అనుసంధానం కోసం నయ పైసా ఇవ్వలేదు తెలంగాణ ప్రజలపై బిజెపి వైఖరి నిరసిస్తూ గ్రామ గ్రామాన సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని అయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి గంగదేవి సైదులు, జిల్లా కమిటీ సభ్యులు రాగిరి కిష్టయ్య, మండల కార్యవర్గ సభ్యులు తడక మోహన్, చీరిక సంజీవరెడ్డి, బోయ యాదయ్య, చింతల సుదర్శన్,మండల కమిటీ సభ్యులు పల్లె మధు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## తీన్మార్ మల్లన్న పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి

చౌటుప్పల్, విశాలభారతి:

పట్టణ కేంద్రంలోని చౌటుప్పల్ రెడ్డి సంఘం నాయకులు కందాల జంగారెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 2వ తేదీన వరంగల్ లోని కాకతీయ యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల మైదానంలో బీసీ రాజకీయ యుద్ధభేరి సభలో వరంగల్,నల్గొండ, ఖమ్మం జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ రెడ్డి సామాజిక వర్గం పై అనుచిత వ్యాఖ్యలు చేశారు. రెడ్డిలు తెలంగాణ వాసులు కాదని రెడ్డిలు బీసీలు ఉచ్చ తాగాలని రెడ్డిలను కించపరిచే విదంగా మాటలు మాట్లాడారు. ఒక ప్రజా ప్రతినిధి ప్రజలకు ఆదర్శంగా ఉండాల్సిన తాను ఓ సామాజిక వర్గాన్ని కించపరిచే విధంగా మాట్లాడడం అతని మాటలు సమాజంలో ప్రజల మధ్య చీలికలు తెచ్చే విధంగా ఉన్నాయని ప్రజల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టి అశాంతిని నెలకొల్పేలా అతని మాటలు ఉన్నాయని, ఇట్టి మాటలు అతని సొంత యూట్యూబ్ ఛానల్ సామాజిక మాధ్యమాలలో ప్రచారం చేసి రెడ్డి సామాజిక వర్గం వారి గౌరవాన్ని కించపరుస్తున్నారు. రెడ్డి సామాజిక వారు ఉచ్చ తాగాలే, దొంగలు, బీసీలు ఉచ్చ పోస్తే కొట్టుకుపోతారు, అంటూ అసభ్యకరమైన, అతి జుగుత్సాకరమైన మాటలు మాట్లాడడం సోషల్ మీడియాలో ప్రచారం చేయడం ఁవంటివి చేస్తూ మా రెడ్డి సామాజిక వర్గాన్ని కించపరుస్తున్న తీన్మార్ మల్లన్న పై వెంటనే చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని చౌటుప్పల్ ఏసిపి కి వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో రెడ్డి ప్రతినిధులు ఎస్ హెచ్ ఓ చౌటుప్పల్, బి.నర్సిరెడ్డి, ఎస్ మైపాల్ రెడ్డి, జి వినయ్ రెడ్డి, పి నవీన్ రెడ్డి, ఎస్ వెంకట్ రెడ్డి, కే వెంకట్ రెడ్డి, ఎస్ సత్తిరెడ్డి ఎస్ వెంకట్ రెడ్డి, బి మధుసూదన్ రెడ్డి,బి శ్రీనివాస్ రెడ్డి, ఎస్ శంకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణ వల్ల ఏజెన్సీ ప్రాంత ఎస్సి కులాలకు ఎటువంటి ప్రయోజనం లేదు

- సాటి ఎస్సీలన్న సంగతి మర్చిపోయిన వర్గీకరణ ఉద్యమాలు
- బొమ్మెర శ్రీనివాస్ ఆరోపణ

కొత్తగూడెం, విశాలభారతి:

ఎస్సీ వర్గీకరణ వల్ల ఏజెన్సీ ప్రాంత ఎస్సి కులాలకు ఎటువంటి ప్రయోజనం ఉండదని షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బొమ్మెర శ్రీనివాస్ అన్నారు. గురువారం కొత్తగూడెం పట్టణ సింగరేణి ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల కార్యాలయం నుండి బుధవారం ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్రంలో సుమారు సగం భూభాగం వెనుకబడ్డ ఏజెన్సీ ప్రాంత ఎస్సీ, మాల, మాదిగ ఉప కులాలు రాష్ట్రంలో జనాభా లెక్కకు మాత్రమే ఉపయోగపడతాయి తప్ప ఏజెన్సీ ప్రాంత ఎస్సీ కులాలకు ప్రయోజనం లేదని ఆరోపించారు. ఏజెన్సీ ప్రాంత స్థానిక ఎస్సీ రిజర్వేషన్ ఉద్యోగం, ఉపాధి,రాజకీయ, కట్టుకున్న ఇంటిపై,సాగు భూమిపై ఎటువంటి హక్కు లేని నిరుపేదలు ఏజెన్సీ ప్రాంత ఎస్సీలు, తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ హయాంలో తీరని అన్యాయం జరిగిందని తెలిపారు.



# అర్హతకు మించిన వైద్యం

- ఎంబీబీఎస్ వైద్యులు చేయాల్సిన వైద్యం ఆర్ఎంపి చేస్తున్న వైనం
- పోల్కంపల్లి గ్రామంలో ఆర్ఎంపీ వైద్యుడి నిర్వాకం

ఇబ్రహీంపట్నం,విశాలభారతి:

ఇబ్రహీంపట్నం మండలం పోల్కంపల్లి గ్రామంలో ఆర్ఎంపీ నిర్వహిస్తున్న ఫస్ట్ ఎయిడ్ క్లినిక్ ను రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. వెంకటేశ్వర్ రావు సీజ్ చేసిన ఘటన చోటు చేసుకుంది. గ్రామస్థులు, డీయంహెచ్ ఓ వెంకటేశ్వర్ రావు తెలిపిన సమాచారం మేరకు పోల్కంపల్లిలో అక్షర క్లినిక్ లో నిబంధనలకు విరుద్ధంగా, అర్హతకు మించి వైద్యం చేస్తున్నట్లు ఫిర్యాదు రావడంతో క్లినిక్ ను బుధవారం పరిశీలించి సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ క్లినిక్ అబార్షన్, డెలవరీ, చిన్న పిల్లలకు చికిత్స చేస్తున్నట్లు ఆరోగ్య శాఖ మంత్రికి గ్రామస్థులు ఫిర్యాదు చేయడంతో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ అదేశాల మేరకు తనిఖీలు చేశామన్నారు. క్లినిక్ లో ఆపరేషన్ చేసే మంచం, శాస్త్ర చికిత్స చేసిన తరువాత కుట్లకు వాడే దారం, స్టెరాయిడ్స్ లభించిందన్నారు. క్లినిక్ నిర్వహించే నిర్వాహకుడు అందుబాటులో లేకపోవడంతో క్లినిక్ ను సీజ్ చేసినట్లు డీయంహెచ్ఓ తెలిపారు. క్లినిక్ నిర్వాహకడిని విచారించిన తర్వాత చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు..




## క్విజ్ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రధానం

ఆర్మూర్,విశాలభారతి.

నవీపేట్ మండల స్థాయి పదవ తరగతి క్విజ్ పోటీలను అభంగ పట్నం జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించారు. అనంతరం గెలుపొందిన విజేతలకు గురువారం డిఈఓ అశోక్ బహుమతులను ప్రధానం చేశారు. మొదటి బహుమతి జిల్లా పరిషత్ బాలికల పాఠశాల నవీపేట్ హవిశ్యతి,రిషిత, రైన తబస్సుం,గంగా రెండవ బహుమతి జిల్లా పరిషత్ బినోల. ధనుష్,భవాని,తేజ,జాహ్నవి, మూడవ బహుమతి టీజీ ఎంఎస్ నవీపేట్. శ్రీనిధి, హర్షిత, అకిరా నందన్, ప్రణవి, గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా డిఈ వో మాట్లాడుతూ క్రమశిక్షణతో ఉంటూ కష్టపడి చదివిన వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. రానున్న పరీక్షలకు సిద్ధం కావాలని కోరారు. క్విజ్ పోటీలను నిర్వహించిన ఉపాధ్యాయులను అభినందించారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ అశోక్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## గోశాలప్రారంభ పూజా కార్యక్రమాలను విజయవంతం చేయాలి.

- గోశాలప్రారంభ ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన ఆలయ అభివృద్ధి కమిటీ.

సూర్యాపేట,విశాలభారతి:

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సాయిబాబా దేవాలయంలో శ్రీ సాయి సేవా సమితి ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గోశాల ప్రారంభోత్సవం సందర్భంగా ఈ నెల 10 సోమవారం నుంచి 12వ తేదీ బుధవారం వరకు నిర్వహించే కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని శ్రీ సాయి సేవా సమితి ట్రస్టు అధ్యక్షులు కర్నాటి రవి పిలుపునిచ్చారు. గురువారం శ్రీ సాయి మందిరంలో గోశాల ప్రారంభ కరపత్రాన్ని కమిటీ సభ్యులతో కలిసి సందర్భంగా వారు మాట్లాడుతూ గోశాల ప్రారంభోత్సవంలో భాగంగా ఈ నెల 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు గణపతి, రుద్ర, చండి, సుదర్శనహోమాలు, శివ కళ్యాణం, అనఘాదేవి సమేత అనఘ స్వామి వ్రతం, గోమాత వృషభ కళ్యాణ పూజా కార్యక్రమాలు నిర్వహించి గోశాల ప్రవేశం చేయనున్నట్లు తెలిపారు. ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేసి స్వామివారి కృపకు పాత్రులు కావాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీ సాయి సేవా సమితి ట్రస్టు ప్రధాన కార్యదర్శి మన్నెం సదాశివ రెడ్డి కోశాధికారి పోతుగంటి మల్లికార్జున్, పోతుగంటి వెంకటేశ్వర్లు యాదా కిరణ్, బొమ్మిడి శ్రీను, ఆలయ ప్రధాన అర్చకులు వలివేటి విశ్వేశ్వరశర్మ, గంగాధరశర్మలు పాల్గొన్నారు.

# "ఇదేం సహకారం"

- మంచాల ప్రాథమిక వ్యవసాయ సహకార బ్యాంక్ తీరు పట్ల రైతుల విమర్శలు
- మధ్యహ్నాం 3 గంటలకే ఎరువుల దుకాణం మూత
- ఎరువుల కోసం రైతుల నిరీక్షణ
- సహకార బ్యాంక్ పై ఉన్నత స్థాయి ఉద్యోగుల పర్యవేక్షణ లోపం

ఇబ్రహీంపట్నం,విశాలభారతి






రైతులకు ఎరువుల కొరత లేకుండా ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అధికారులకు ఆదేశాలు జారీ చేసిన కింది స్థాయి ఉద్యోగులు మాత్రం దానిని పాటించడం లేదు. పేరుకు ప్రాథమిక సహకార బ్యాంక్ అయినా రైతుల పాలిట యమపాశంగా వ్యవహరిస్తోందనే మంచాల మండలంలో అపవాదు వస్తోంది. రైతులకు సహకార బ్యాంక్ లో పంటలకు విత్తనాలు, ఎరువులు ఉదయం నుండి సాయంత్రం వరకు అందుబాటులో ఉండాలని ఉన్నత స్థాయి అధికారులు చెబుతున్నారు. కానీ కింది స్థాయి ఉద్యోగులు మాత్రం వాళ్లకు ఇష్టం వచ్చిన సమయంలో ఎరువుల దుకాణం తెరవడం , మూసేయడం జరుగుతుంది. గురువారం ఎరువుల కోసం మధ్యాహ్నం మూడు గంటలకు వచ్చిన రైతులు చాలాసేపు ఎదురు చూస్తూ పడిగాపులు కాస్తున్నారు. మంచాల మండలం సహకార సంఘం లో ప్రతి రోజూ ఇలాగే జరుగుతుందని రైతులు వాపోతున్నారు. రైతులకు ఇబ్బంది కలగకుండా ప్రతిరోజూ ఉదయం నుండి సాయంత్రం వరకు విత్తనాలతో పాటుగా ఎరువులు అందించాలని రైతులు కోరుతున్నారు..

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శుక్రవారం,
07.02.2025
హైదరాబాద్
epaper:vishalabharathi.com
www.vishalabharathi.com



# నాలుగేళ్ల చిన్నారి మృతి

- డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల ఒక నిండు ప్రాణం బలి
- ప్రైవేటు వాహనాలను ప్రోత్సహిస్తున్న శ్రీ చైతన్య స్కూల్ యాజమాన్యం



**పెద్ద అంబర్పేట్, విశాలభారతి:**

హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘోర రోడ్డు ప్రమాదంలో నాలుగేళ్ల చిన్నారి మృతి చెందినట్లు సీఐ నాగరాజు గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ... హనుమాన్ హిల్స్, పెద్ద అంబర్‌పేట్, హయత్‌నగర్ కు చెందిన బోబిలగామ రిత్విక తండ్రి నర్సింహులు యొక్క కూతురు ఘోర రోడ్డు ప్రమాదం జరిగిందని తెలిపారు. వయస్సు 4 సంవత్సరాలు శ్రీ చైతన్య స్కూల్ నందు ఎల్కేజీ చదువుతుందని ఒక ప్రైవేటు వాహనంలో స్కూలుకు వెళ్లేవారని టీఎస్18 టి 1 0 7 1 గల వాహనం నుండి జారిపడి మరణించారని డ్రైవర్ కొమ్ము గణేష్ తండ్రి నరసయ్య 27 సంవత్సరాలు వృత్తిరీత్యా డ్రైవింగ్ చేసేవాడని నివాసం ఎల్లారెడ్డి కాలనీ హయత్ నగర్ లో ఉంటూ మినీ వాహనానం మహీంద్రా మినీ సూపర్ నడుపుతూ జీవనోపాధి చేసే వాడని తన అజాగ్రత్త మరియు నిర్లక్ష్యం గా నడపడం వలన ఒక నిండు ప్రాణాన్ని కోల్పోవడం జరిగిందని చిన్నారి బాలిక తలపై నుండి వెళ్లడం తో అక్కడికక్కడే మృతి చెందినట్లు ఇన్స్పెక్టర్ నాగరాజు తెలిపారు,వెంటనే మృతదేహాన్ని మార్చురీకి తరలించడం జరిగిందని మృతికి గల కారణాలపై ఆరా తీస్తూ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## కుంభమేళా జలానికి ప్రత్యేక పూజలు



**ఆమనగల్లు,విశాలభారతి :**

కడ్తాల్ మండల కేంద్రంలోనీ చెన్నకేశవ స్వామి ఆలయంలో గురువారం కుంభమేళా నుంచి బీఆర్ఎస్ నాయకులు తీసుకువచ్చిన గంగా జలానికి గ్రామం సిరిసంపదలతో కళకళలాడాలని ప్రత్యేక పూజలుచేశారు.అంతకుముందు జలాన్ని మేళతాలాల మధ్య ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ప్రతి ఇంటికి గంగా జలం చేరాలనే ఉద్దేశంతో వాటర్ ట్యాంకులలో జలాన్ని కలిపారు. పీఏసీఎస్ ఛైర్మన్ వెంకటేష్,నాయకులు దశరథ నాయక్, ఆనంద్, రామకృష్ణ, రాఘవేందర్ పాల్గొన్నారు.





# ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతోనే నాణ్యమైన పాఠ్యాంశాల రూపకల్పన.

- డిజిటల్ యుగంలో అధ్యాపకుల పాత్ర కీలకమైనది.
- ఘనంగా ఓయూ ఈయంఆర్సీ సేవాలు భేష్

**విశాలభారతి, ఓయూ:**

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవటం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన పాఠ్యాంశాలను రూపకల్పన చేయటం అధ్యాపకులకు అనివార్యమని తెలంగాణ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొ. వి. బాలకిష్టారెడ్డి అన్నారు. సీఈసీ న్యూఢిల్లీ సహకారంతో ఎడ్యుకేషనల్ డిజిటల్ ఫ్రాంటియర్, మాసివ్ ఓపెన్ ఆన్లైన్ కోర్సెస్ రూపకల్పనపై ఉస్మానియా విశ్వవిద్యాలయ ఎడ్యుకేషనల్ మల్టీ మీడియా రీసెర్చ్ సెంటర్ (ఈఎంఆర్సీ) ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న జాతీయ కార్యశాలకు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.అధ్యాపకులు నిరంతరం తన నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని అన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో కొలువులకు కొదవలేదన్న ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి అన్నారు. నైపుణ్యాలు లేకపోవటం వల్లే ఉద్యోగావకాశాలు దూరమవుతున్నాయని అన్నారు. సీఈసీ, ఈఎమ్మార్సీ అందించే కోర్సులు విద్యార్థుల నైపుణ్యాల మెరుగుదలకు ఉపయోగపడతాయని వివరించారు. దేశంలోని ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించేందుకు డిజిటల్ విద్యావిధానం ఎంతగానో ఉపయోగపడుతుందని సీఈసీ డైరెక్టర్ ప్రొఫెసర్ జగత్ భూషణ్ నడ్డా అన్నారు. అధ్యాపకులు తమ సబ్జెక్టుల్లో మ్యాసివ్ ఓపెన్ ఆన్లైన్ కోర్సులు రూపొందించాలని సూచించారు. 2035 వరకు 28శాతంగా ఉన్న విద్యార్థుల గ్రాస్ ఎన్రోల్ మెంట్ నిష్పత్తిని 2035 వరకు 50 శాతానికి తీసుకురావాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని చేరుకోవాలంటే డిజిటల్ విద్యా విధానంతో మాత్రమే సాధ్యమని అన్నారు. ఓయూ ఈఎమ్మార్సీ ద్వారా డిజిటల్ పాఠాల రూపకల్పనకు అధ్యాపకులు ముందుకు రావాలని సూచించారు. మారుతున్న డిజిటల్ యుగంలో అధ్యాపకుల పాత్ర అత్యంత కీలకమని ఓయూ రిజిస్ట్రార్ ప్రొ. జి. నరేష్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రస్తుత తరుణంలో విద్యార్థులను తరగతి గదికి పరిమితం చేయటం అత్యంత కష్టసాధ్యమని.ఓపెన్ రిసోర్సెస్ నుంచి విద్యార్థులకు కావాల్సినంత జ్ఞానాన్ని పొందుతున్నారని గుర్తు చేశారు. అందుకే అధ్యాపకులు నైపుణ్యాలను పెంచుకోకపోతే విద్యార్థులు ప్రత్యామ్నాయమార్గాలను ఎంచుకుంటారని వివరించారు. మూక్స్ రూపకల్పనలో అవసరమైన నైపుణ్యాలను అధ్యాపకులు అందిపుచ్చుకోవాలని సూచించారు. సీఈసీ, ఈఎమ్మార్సీ ఏర్పాటు చేసిన జాతీయ కార్యశాల అందుకు అవసరమైన నైపుణ్యాలను బోధిస్తోందని ఓయూ యూజీసీ వ్యవహారాల డీన్ ప్రొఫెసర్ బి. లావణ్య అభినందించారు. అంతకు ముందు ఈఎమ్మార్సీ డైరెక్టర్ పి. రఘుపతి స్వాగతోపన్యాసం చేశారు.ఈ సెమినార్ కు తెలంగాణ సహా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 152 అధ్యాపకులు హాజరయ్యారు. మొదటి రోజు పర్సనలైజ్డ్ లెర్నింగ్ - పాత్ వేస్ ఇన్ మూక్స్ అంశంపై రాయలసీమ విశ్వవిద్యాలయ మాజీ వీసీ ప్రొ. వై నర్సింహులు, ఎన్ హాన్సింగ్ మూక్స్, ఆక్సెసబిలిటీ విత్ డిజిటల్ టూల్స్ అనే అంశంపై వికెన్ డిజిటల్ సొల్యూషన్స్ వ్యవస్థాపకుడు ప్రొ. గణేష్ లోకండే, ఎథిక్స్ అండ్ డాటా ప్రైవసీ ఇన్ ది మూక్స్ ఎకో సిస్టమ్ అనే అంశంపై క్లౌడ్ సీల్ సీఈఓ శ్రీనివాస్ పల్లె అధ్యాపకులకు బోధించారు. కార్యక్రమంలో ఈ యం ఆర్సీ ఉద్యోగులు, విద్యార్థులు, పాల్గొన్నారు.




# హామీల అమలులో కాంగ్రెస్ పార్టీ విఫలం

- రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు , మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:**

హామీల ఇచ్చి వాటిని అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలం అయ్యిందని బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు , ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి ఆరోపించారు. మంచాల మండలంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలన దరఖాస్తులతో కాలయాపన చేస్తుందని అన్నారు. కాంగ్రెస్ పాలన తో విసుగు చెందిన ప్రజలు బిఆర్ఎస్ వైపు మొగ్గు చూపుతున్నారని పేర్కొన్నారు. స్థానిక ఎన్నికలకు పార్టీ కార్యకర్తలు సమాయత్తం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్ , మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి, మంచాల మండలం పార్టీ అధ్యక్షుడు చీరాల రమేష్ , ప్రధాన కార్యదర్శి బహదూర్,జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకట రమణ రెడ్డి , నేతలు జక్కా రాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# నిందుతులను కఠినంగా శిక్షించాలి.

- కుటుంబానికి రక్షణ కల్పించండి.
- భాదితులను పరామర్శించి కుటుంబ సభ్యులలో మనోధైర్యాన్ని నింపిన
- రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

**సూర్యాపేట,విశాలభారతి:**

ఇటీవల హత్యగావించబడిన వడ్లకొండ కృష్ణ అలియాస్ మాల బంటి నిందితులను కఠినంగా శిక్షించాలని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు. గురువారం రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ అలాగే సభ్యులు జిల్లా కేంద్రం లోని బంటి ఇంటికి వెళ్ళి బంటి భార్య బార్గవి, తండ్రి బిక్షం ,అక్క శ్వేత,బావ నరెష్ లను పరమర్శించి మనో ధైర్యం కల్పించారు. బంటి చిత్రపటానికి పూలు వేసి నివాళులు అర్పించారు.అనంతరం జిల్లా కలెక్టరెట్ కు వెళ్ళి బంటి హత్య కేసు పురొగతి పై చర్చించారు.బాధిత కుటుంబానికి రక్షణ కల్పించాలని అలాగే భాధితులకి త్వరగా న్యాయం జరిగేలా చూడాలని అన్నారు.కేసు వెనక్కి తీసుకుంటే రెండు కోట్ల రూపాయలు ఇస్తామని, లేకపోతే చంపెస్తామని బెదిరిస్తున్నారని బాధితులు కమిషన్ చైర్మన్ కి చెప్పగా హత్యలో పాల్గొన్న నిందితులను, బెదిరింపులకు పాల్పడుతున్న దుండగులను గుర్తించి తక్షణమే అరెస్టు చేయాలని ఆదేశించారు. ఇప్పటి వరకు ఆరుగురు నిందితులను అరెస్టు చెశామని, మిగతవారిని సైతం అరెస్టు చెస్తామని అదనపు ఎస్పీ, డిఎస్ పి వివరించారు. బాదిత కుటుంబానికి నాలుగు లక్షల నష్టపరిహారం చెల్లించామని కలెక్టర్ వివరించారు. కుటుంబాన్ని పూర్తి స్థాయిలో అదుకొవాలని చట్టం ప్రకారం నిత్యావసర సరుకులు తక్షణ సహాయం అందజేయాలని,పెన్షన్ ,ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, అయిదు ఎకరాల భూ పంపిణీ చెయాలని, ఉద్యోగం ఇవ్వాలని చైర్మన్ కలెక్టర్ ని అదెశించారు.ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లా డివియంసి సమావేశం జరపాలని,ప్రతి నెల చివరన పౌర హక్కుల దినోత్సవం జరపాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో కమిషన్ సభ్యులు జిల్లా శంకర్, రాంబాబు,ఆర్డిఓ వేణు మాధవ్ ,ఎస్సీ సంక్షేమ అధికారి లత, అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతల తీర్మానం

**బాల్కొండ,విశాలభారతి:**



తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో సామాజిక ఆర్థిక ఉపాధి విద్య,కుల సర్వే 2024 నిర్వహించి తీర్మానాన్ని శాసనసభలో,శాసనమండలిలో ఆమోదించినందుకు బాల్కొండ తహశీల్దార్ ద్వారా తెలంగాణ ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బాల్కొండ మండల కాంగ్రెస్ పార్టీ తరఫున కృతజ్ఞతలు అభినందన తీర్మానాన్ని పంపించారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వేంకటేష్ గౌడ్,జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ చిట్యాల శ్రీనివాస్,కిషన్ గౌడ్,యనుస్,ప్రవీణ్ గౌడ్,చాట్ల నరేష్,అన్వర్,సాగర్, మదర్,వాబ్,సతీష్,గంగాధర్,నాగేష్ రంజిత్,రాజలింగం,హనుమాత్, తదితరులు పాల్గొన్నారు.

# చిన్నతనం నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలి

**ఆమనగల్లు,విశాలభారతి :**




ప్రతి ఓటమి మరో గెలుపునకు నాంది పలుకుతుందని శెట్టిపల్లి సత్యం అన్నారు.ఆమనగల్లు మండల పరిధిలోని శెట్టిపల్లి గ్రామంలో నాలుగవ ఓపెన్ టు వాలీబాల్ టోర్నమెంట్ సోమవారం ముగిసింది.మాజీ సర్పంచ్ గోదాదేవి సత్యం బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ చిన్నతనం నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చునని, క్రీడా పోటీల్లో ప్రతి ఒక్కరూ గెలుపు ఓటములను పట్టించుకోకుండా క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. క్రీడల్లో ముందుకు సాగాలంటే సాధననే ముఖ్యమని తెలిపారు. లైన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాము,ఆలయ చైర్మన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



# జిల్లా ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శిగా ఇమ్మడి

- సోమనర్సయ్యను నియమించాలి.
- పలువురు ఆర్యవైశ్య ప్రముఖుల డిమాండ్.

**సూర్యాపేట,విశాలభారతి:**

సూర్యాపేట జిల్లా ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శిగా ఇమ్మడి సోమ నరసయ్యను నియమించాలని జిల్లా కేంద్రానికి చెందిన పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు.జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులుగా కోదాడకు చెందిన వెంపటి వెంకటేశ్వరరావు ఏకగ్రీవ ఎన్నికకు సహకరించామని తెలిపారు.అదే విధంగా సంఘంలో రెండో ముఖ్య పదవి అయిన ప్రధాన కార్యదర్శి పదవిని సూర్యాపేట డివిజన్ కి కేటాయించాలని కోరారు. వర్తక వ్యాపార పరంగానే కాకుండా అన్ని రకాలుగా ముఖ్య కేంద్రమైన జిల్లా కేంద్రంకుఅనేక మంది బీద, పేద ఆర్యవైశ్యులు వచ్చి ఇక్కడి ప్రముఖుల సహాయ సహకారాలు పొందుతున్నారని తెలిపారు.జిల్లా కేంద్రంలోని ఆర్యవైశ్య ప్రముఖులు అందరూ పట్టణంలో జరిగే అన్ని కార్యక్రమాలకు చేయూతనిచ్చి అండగా ఉంటున్నారని పేర్కొన్నారు. పలు ముఖ్య విషయాలను పరిగణలోకి తీసుకొని ప్రధాన కార్యదర్శి పదవిని తాము కోరుకున్న విధంగా కేటాయించాలని అన్నారు. అన్ని వర్గాల వారికి సహాయ సహకారాలు అందిస్తున్న ఇమ్మడి సోమ నరసయ్యకు ప్రధాన కార్యదర్శి పదవిని కేటాయించడం సబబుగా తాము భావిస్తున్నట్లుగా తెలిపారు. తమ అభిప్రాయాలను గౌరవించి జిల్లాలో సంఘ బలోపేతానికి కృషి చేయాలని అన్నారు. సూర్యాపేట డివిజన్ కు ప్రధాన కార్యదర్శి పదవిని కేటాయించకపోతే తమ భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు సింగిరికొండ రవీందర్, తోట శ్యాంప్రసాద్, తాటికొండ సీతయ్య, మీలా వంశీ, మంచాల రంగయ్య, కలకోట లక్ష్మయ్య, దేవరశెట్టి సత్యనారాయణ, పబ్బతి వేణుమాధవ్, వెంపటి పురుషోత్తం, రాచకొండ శ్రీనివాస్, వెంపటి శబరినాథ్, బిక్కు మల్ల కృష్ణ, గుండా శ్రీధర్, బెలిదే శ్రీనివాస్, వంగవీటి రమేష్, గుడుగుంట్ల విద్యాసాగర్ చల్లా లక్ష్మయ్య, వెంపటి రవితేజ, చింత వెంకన్న, మంచాల శ్రీనివాస్, మిట్టపల్లి రమేష్, శ్రీరంగం రాము, కర్నాటి వంశీ, భాను తేజ, తప్పి అనిల్ కుమార్, బచ్చు పురుషోత్తం, పెనుగొండ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం

**ఆర్మూర్,విశాలభారతి:**



ఆలూరు మండల కేంద్రంలో గురువారం కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల, కార్యకర్తల సమావేశం నియోజకవర్గ ఇన్చార్జ్ పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రతి కార్యకర్త ఐకమత్యంగా ఉంటూ, సైనికుడు లాగా పని చేయాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న హామీలను ప్రజలకు వివరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ రాజారెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాయేర్ బిన్ హందన్,రాష్ట్ర నాయకులు ఏ బి చిన్న,యల్ల సాయిరెడ్డి, ఆర్మూర్ మార్కెట్ యార్డ్ ఛైర్మెన్ సాయిబాబా గౌడ్, మంద మహిపాల్,భూమేష్ రెడ్డి, చిన్న రెడ్డి,రవి,ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

శుక్రవారం,
07.02.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com

6

GENERAL NEWS

## వీఆర్ఏ ల సమస్యలు పరిష్కరించాలి

బాల్కొండ,విశాలభారతి:

వీఆర్ఏ ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ హైదరాబాద్ కు వెళ్లిన వారిని అరెస్ట్ చేయడం శోచనీయం అని ఆ సంఘం అధ్యక్షులు కొండయ్య,ఉపాధ్యక్షులు సాయిలు అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట వీఆర్ఏ ల అరెస్ట్ కు నిరసనగా నల్ల బ్యాడ్జీలు ధరించారు. వీఆర్ఏ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ భీమ్‌గల్ తహసీల్దార్ షబ్బీర్ కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏండ్లుగా గ్రామాలలో వెట్టి చాకిరీ చేస్తున్న తమను ప్రభుత్వం గుర్తించకపోవడం బాధాకరం అన్నారు.గత ప్రభుత్వం ఇచ్చిన జీవో 81,85 లను వెంటనే అమలు చేయాలనీ కోరారు.రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వీఆర్ఏ ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



# స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

- బిఆర్ఎస్ శ్రేణులకు మాజీ శాసనసభ్యులు సతీష్ కుమార్ పిలుపు

విశాలభారతి, ఎలుకతుర్తి:

ఎల్కతుర్తి మండల కేంద్రంలోని ఎస్ఎం ఆర్ గార్డెన్లో ఏర్పాటుచేసిన సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే వోడితల సతీష్ కుమార్ దిశా నిర్దేశం చేశారు. రాబోవు రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్న తరుణంలో పార్టీ నాయకులు కార్యకర్తలు కష్టపడి పార్టీ నిర్దేశించిన అభ్యర్థులను గెలిపించుకునేందుకు అందరు సిద్ధంగా ఉండాలని.అవకాశం రాలేదని ఎవరు బాధపడవలసిన అవసరం లేదని మళ్లీ ఎంపిటిసి ఎన్నికలు ఉన్నందున అవకాశాలు కచ్చితంగా వస్తాయని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమైంది కాంగ్రెస్ పార్టీ వైఫల్యలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు .స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయం బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు గెలవడం ఖాయం . అని సతీష్ కుమార్ అన్నారు ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పిట్టల మహేందర్ సింగిల్ విండో చైర్మన్ శ్రీపతి రవీందర్ గౌడ్ వైస్ చైర్మన్ మునిగడప శేషగిరి రైల్వే బోర్డు సభ్యులు యేల్తూరి స్వామి మాజీ ఎంపీపీ మేకల స్వప్న మాజీ వైస్ ఎంపీపీ తంగెడ నగేష్ మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు కదారి రాజు మాజీ రైతుబంధు సమితి మండల అధ్యక్షులు పోరెడ్డి రవీందర్ రెడ్డి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ తంగేడ మహేందర్ రాష్ట్ర నాయకులు గొల్లె మహేందర్ బిఆర్ఎస్వి నియోజకవర్గ ఉపాధ్యక్షులు గోడిశాల వినయ్ గౌడ్ యూత్ అధ్యక్షులు కొమ్మిడి మహిపాల్ రెడ్డి సోషల్ మీడియా మండల అధ్యక్షులు గుండేటి సతీష్ నేత ఎస్సీ సెల్ అధ్యక్షులు సాతూరి శంకర్ మైనారిటీ సెల్ అధ్యక్షులు మదార్ వోడితల యువసేన అధ్యక్షులు చిట్టి గౌడ్ సీనియర్ నాయకులు గుండా ప్రతాప్ రెడ్డి ప్రహల్లాద రావు రాజు దూలం సుధాకర్ సురేష్ మహిళ నాయకులు మేరీ భాగ్యలక్ష్మి అనూష రజిత తదితరులు పాల్గొన్నారు.

# జలమండలి అధికారుల నిర్లక్ష్యం

- అవస్థలు పడుతున్న స్థానిక ప్రజలు
- కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి

పెద్ద అంబర్ పేట్,విశాలభారతి:





హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు డివిజన్లోని సత్య నగర్ కాలనీలో పర్యటించి కాలనీవాసుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలో పూర్తిస్థాయిలో భూగర్భ డ్రైనేజీ సదుపాయం లేకపోవడం కాలనీవాసులు అవస్థలు పడుతున్నారని తీసిన వెంటనే కాలనీల్లో సందర్శించడం జరుగుతుందాని కాలనీల్లో వస్తున్న సమస్యలు జలమండలి అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రజల అవస్థలు పడుతున్నారని సత్య నగర్ కాలనీలో నూతన భూగర్భ డ్రైనేజీ పైప్ లైన్ నిర్మాణం కోసం నిధులు మంజూరై దాదాపు సంవత్సర కాలం గడుస్తున్నప్పటికీ, ఇంతవరకు పనులు ప్రారంభం కాలేదని ప్రజల అవస్థలు పడుతుంటే అధికారులు మాత్రం నిమ్మకు నీలెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారని తెలిపారు, అదేవిధంగా కాలనీవాసులు విద్యుత్ దీపాల సమస్యను కూడా వెంటనే కాలనీలో నూతన విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసే చర్యలు తీసుకుంటానని కాలనీవాసులకు హామీ ఇవ్వడం, హయత్ నగర్ మదర్ డైరీ సమీపంలో శుభోదయం కాలనీ వద్ద ప్రధాన రోడ్డు మార్గంలో చెత్తాచెదారం చూసిన వెంటనే కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యతని చెత్తాచెదారాన్ని ఇలా బహిరంగ ప్రదేశాలలో చెత్తాచెదారాన్ని వెయ్యకుండా చూసుకొనే భాద్యత మనందరి భాద్యత అని గుర్తు చేశారు, స్వచ్ఛ ఆటోలో మాత్రమే వెయ్యాలని బహిరంగ ప్రదేశాల్లో వేయకూడదని విజ్ఞప్తి చేశారు,సంబంధిత రాంకీ సిబ్బంది కూడా డంపింగ్ యార్డ్ వద్ద చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు ఉగాది ఎల్లప్ప, కాలనీ అధ్యక్షులు శ్రీనివాస్ ,సంక్షేమ సంఘం సభ్యులు శక్తి సింగ్ నరసింహారెడ్డి,శ్రీను , నాగేష్,సత్తయ్య కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీ కులగణన చారిత్రాత్మకం

- మాటల్లో కాదు చేతల్లో చూపిన సీఎం రేవంత్ రెడ్డి
- తెలంగాణలో పెరగనున్న బీసీల రాజకీయ అవకాశాలు
- ముఖ్యమంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపిన నీలం మధు ముదిరాజ్



పటాన్ చెరు,విశాలభారతి:

దేశంలో ఎక్కడ లేని విధంగా జనాభా ప్రాతిపదికన బీసీ వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించే దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేసిన బీసీ కులగణన చారిత్రాత్మకమని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. గురువారం హైదరాబాద్ జుబ్లీహిల్స్ లోని ముఖ్యమంత్రి నివాసంలో నీలం మధు సీఎంను కలిసి పుష్పగుచ్చం అందించి తెలంగాణలోని బీసీల పక్షాన ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ దశాబ్దాలుగా బీసీలలో రాజకీయ చైతన్యం ఉన్నా రాజకీయ ప్రాతినిధ్యం అవకాశం లేక చాలామంది బీసీలు నాయకులుగా ఎదగలేకపోయారని కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఒక బృహత్ సంకల్పంతో కులగణన ని చేపట్టి దేశానికి ఆదర్శంగా నిలిచిందని గుర్తు చేశారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బీసీ వర్గాలకు కులగణన పట్ల ఇచ్చిన హామీని తెలంగాణ ప్రజా ప్రభుత్వం నిలబెట్టుకుందన్నారు. ప్రజలకు సంక్షేమం అభివృద్ధి సామాజిక న్యాయం మాటల్లో కాదు చేతల్లో చూపిస్తున్న దమ్మున్న నాయకుడు రేవంత్ రెడ్డి అని కొనియాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న ఈ చారిత్రాత్మక నిర్ణయంతో రానున్న రోజుల్లో బీసీ బిడ్డలంతా రాజకీయంగా ఎదగడానికి అవకాశాలు లభిస్తాయని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం పెంచే దిశగా అసెంబ్లీలో నిర్ణయం తీసుకోవడం పట్ల కాంగ్రెస్ పార్టీకి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రాష్ట్ర మంత్రులు అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సామాజిక న్యాయం దిశగా అడుగులు వేస్తూ బీసీలకు రాజకీయ అవకాశాలు కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ప్రజా ప్రభుత్వానికి తెలంగాణ బీసీలమంతా రుణపడి ఉంటామని నీలం మధు ముదిరాజ్ పేర్కొన్నారు.

# సుప్రీంకోర్టు ఆదేశానుసారం ఆర్టిఐ కమిషనర్ ను నియమించాలి

- సమాచారహక్కు చట్టం సామాన్యుడి చేతిలో వజ్రాయుధం
- తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా గోపీనాథ్ కట్టెకోల ఏకగ్రీవంగా ఎన్నిక

పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:




సమాచార హక్కు చట్టం సాధన కమిటీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా గోపీనాథ్ కట్టెకోలను నియమిస్తున్నట్లు సమాచార హక్కు చట్టం సాధన కమిటి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్.చంటి ముదిరాజ్ మరియు రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు డాక్టర్.చంటి ముదిరాజ్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం 2005 ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పకడ్బందీగా అమలు చేయాలని, ఆర్‌టిఐ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలుకోరిన సమాచారాన్ని 30 రోజుల్లోపు ఇవ్వాలని, వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగినప్పుడు, ప్రాణహాని ఉన్నప్పుడు కేవలం 48 గంటలలో సమాచారం అధికారులు ఇవ్వాలని అన్నారు. ఈ చట్టాన్ని ప్రజా ప్రయోజనాల నిమిత్తం సద్వినియోగం చేసుకోవాలని దుర్వినియోగం చేయకూడదని అవసరమైన సమాచారం మేరకే ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచారం తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నికైన గోపీనాథ్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం 2005 ప్రకారం గ్రామ పంచాయతీలు మొదలుకొని పార్లమెంటు వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ప్రతి పౌరుడు దరఖాస్తు చేసుకొని తనిఖీ చేయవచ్చన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు వెన్నెముక అయిన సమాచార హక్కు చట్టం 2005 కు సంబందించిన 4 (1) బి సంబంధించిన 17 అంశాల సమాచారం, రిజిస్టర్ 1, రిజిస్టర్ 2 న గల కాపీలను ఉచితంగా, స్వచ్ఛందంగా ప్రజలకు కోరినప్పుడు అధికారులు ఇవ్వాలని అన్నారు.మూడో వ్యక్తి సమాచారం విషయంలో ప్రజా ప్రయోజనాలకు ఉపయోగపడే సమాచారం అయితే సెక్షన్ 11 (1) ప్రకారంగా దరఖాస్తుదారునికి అధికారులు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇవ్వని అధికారులకు కనిష్టంగా 250 నుండి గరిష్టంగా 25 వేల వరకు జరిమానాలు సమాచార హక్కు చట్టం రాష్ట్ర కమిషనర్ విధిస్తారని అన్నారు.సమాచార హక్కు చట్టం 2005 ప్రకారం సిబిఐ,సిఐడి, కోర్టు జడ్జిమెంట్, దేశ భద్రత సమాచారం,పోలీస్ స్టేషన్ భద్రత, ఆయుధాల సమాచారాన్ని మినహాయించబడిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం గౌడ్,రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తుల మహేష్ గౌడ్, రంగారెడ్డి జిల్లా సంయుక్త కార్యదర్శి దీపక్ కులకర్ణి,పందుల రాజు గౌడ్, కె.రామయ్య తదితరులు పాల్గొన్నారు.



# వర్గీకరణ ద్వారా మాలమాదిగలకున్యాయమే జరిగింది

- దక్షిణాది జాక్ చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ గాలి వినోద్ కుమార్

విశాలభారతి,ఓయూ:

వర్గీకరణ ముసయిదా చట్టంలో మాదిగ మాలలకు జనాభా పద్దతి ప్రకారం గ్రూప్ 2, కు 9% గ్రూప్ 3 కు 5% రిజర్వేషన్స్ వర్గీకరణ న్యాయభద్దంగానే జరిగిందని దక్షిణాది జాక్ చైర్మన్ ప్రొ. గాలి వినోద్ కుమార్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. గురువారం తార్నాక లోని తన కార్యక్రమంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ. గ్రూప్ 2 లో మాదిగతో 17 కులాలు 62% జనాభా కలిగి ఉంటే గ్రూప్ 3 మాలతో కలిపి 26 కులాలు 33% జనాభా 2011 లెక్కల ప్రకారం ఉన్నారని వారికి అన్యాయం జరగలేదని బైండ్ల మన్నే కులాలను గ్రూప్ 2,3 లో ఒక్కక్కరిని కలిపితే సరిపోతుంది ఇకనైనా 5% దళిత విద్యావంతుల కోసం 30 ఏళ్ల పోరాటం చాలని మిగతా 95% పేద, మధ్య తరగతి దళిత అన్ని రంగాల్లో అభివృద్ధి ఆత్మగౌరం అధికారం కోసం ఐక్యంగా కలిసి పోరాటం చేద్దామని ఆయన పిలుపునిచ్చారు.





# నకిలీ విత్తన కంపెనీల నుండి రైతులను కాపాడుకోవాలి.

- అధికారులు రైతు మేలు కోరాలి.
- నకిలీ విత్తనాలతో మోసపోయిన భాదితుల పొలాలను పరిశీలన
- రాష్ట్ర వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి మరియు సభ్యులు

సూర్యాపేట,విశాలభారతి

నకిలీ విత్తన కంపెనీల నుండి రైతులను కాపాడుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. గురువారం తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి, కమిషన్ సభ్యులు నకిలీ విత్తనాల వల్ల నష్టపోయిన పెన్ పహాడ్ మండలం పొట్లపహాడ్ గ్రామ రైతులు పొలాలను సందర్శించారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ గరిడేపల్లి మండలం గడ్డిపల్లి లోని వెంకటసాయి సీడ్స్ వారి నుండి కొనుగోలు చేసిన సిరి 101,కావేరి సింట్లు అనే రకానికి చెందిన వరి విత్తనాలు నాటు పెట్టిన 40 రోజులకే ఈనటం మొదలు అయిందని,ఇట్టి విషయం రాష్ట్ర వ్యవసాయ కమిషన్ దృష్టికి రావటంతో వరి నాటు పెట్టిన 75 రోజుల తర్వాతనే ఈనటం మొదలు అవుతుంది కానీ 40 రోజులకే ఈనటం ఏంటి అని తెలుసుకెనేందుకే వ్యవసాయ కమిషన్ సభ్యులతో కలిసి క్షేత్ర స్థాయి లో పర్యటించామని తెలిపారు.భాధిత రైతులు సంబంధిత కంపెనీ వారితో మాట్లాడగా వాతావరణం వల్ల ఇలా జరిగిందని అంటున్నారని వారు మాతో తెలిపారని అన్నారు.వాతావరణం లో మార్పుల వల్ల వరికి తెగుళ్లు వస్తాయి కానీ నాటిన 40 రోజులకే ఈనదని అవి నకిలీ విత్తనాల వల్లే ఈ సమస్య వచ్చిందని,అట్టి విత్తనాలు మెరుగైన సర్టిఫైడ్ విత్తనం కాదని నకిలీ విత్తనం అని నిర్ధారణ అయిందని తెలిపారు. నకిలీ విత్తనాల వల్ల రైతులు నష్టపోయారని ఇట్టి విషయాన్నీ నివేదిక రూపంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెల్తామని అన్నారు .ఇప్పటికైనా కంపెనీలు వ్యాపారం దృష్ట్యా ఆలోచించకుండా రైతు నష్టపోకుండా రైతు బాగు కోరి విత్తనాలు తయారు చేయాలని సూచించారు .తదుపరి జిల్లా కలెక్టర్ ఛాంబర్ నందు వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ డీలర్ షిప్ అనుమతి,సర్టిపికెట్ ఉన్న విత్తన కంపెనీలు మాత్రమే విత్తనాలు అమ్మే లా చూడాలని అన్నారు.జిల్లాలో ఎన్ని ఎకరాలలో వరి, ఇతర పంటలు సాగు చేశారని అధికారులను అడిగి తెలుసుకున్నారు.తదుపరి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అనుమతి ఉన్న డీలర్ల్, సర్టిపికెట్ ఉన్న విత్తనాల శాంపిల్స్ సేకరించి పరిశీలన చేసిన తర్వాతనే రైతులకి విత్తనాలు విక్రయించేలా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమం లో వ్యవసాయ కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న,సునీల్, రాంరెడ్డి గోపాల్ రెడ్డి, భవాని,జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, ఈ సెక్షన్ సూపరిటీడెంట్ సాయగౌడ్, వ్యవసాయ శాఖ పరిపాలన అధికారి ఆశా కుమారి,సూపరిటీడెంట్ శ్రీనివాస్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శుక్రవారం,
07.02.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



## మంద కృష్ణను కలిసిన మాట్ల వెంకటస్వామి

విశాలభారతి,భీమదేవరపల్లి :

మందకృష్ణ మాదిగ పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన శుభ సందర్భాన్ని పురస్కరించుకొని, హైదరాబాదులో గురువారం వారి నివాసంలో హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్చార్జ్ మాట్ల వెంకటస్వామి బృందం శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా "లక్షల డప్పులు వెయ్యి గొంతులు" వాయిదా వేసిన విషయాన్ని ప్రస్తావించగా, త్వరలోనే మళ్లీ తేదీని ఖరారు చేస్తానని తెలిపారు. మంద కృష్ణను కలిసిన వారిలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు లింగాల సాయన్న, ముక్కెర సంపత్ కుమార్, కొలుగూరి అశోక్ ఉన్నారు.

# తాటిచెట్ల మీద పాములు... గౌడన్నా జర పైలం

- మండలంలో వరుస సంఘటనలు
- సేఫ్టీ మోకులు సెఫ్టియేనా ?
- భయం భయంతో బతుకు ఛిద్రం



విశాలభారతి,భీమదేవరపల్లి :

గీతా కార్మికుల బతుకే ప్రమాదకరం క్షణ క్షణం భయం భయం తాటిచెట్టు ఎక్కేందుకు వెళ్లిన గీతా కార్మికుడు క్షేమంగా తిరిగొస్తాడో రాడో అన్న ఉత్కంఠ నాటి నుంచీ నేటికీ వేదనా భరిత జీవితాలను అనుభవిస్తున్నారు గీతా కార్మికులు. వారి జీవితాలు రోజురోజుకు దిగజారిపోతున్నాయి. ఇటీవల మండలంలోని గట్ల నర్సింగాపూర్ గ్రామంలో తాటి చెట్టు మీద పాము ఉండడాన్ని చూసి ప్రాణాలు కోల్పోయిన వారు ఒకరు.. నిన్నటికి నిన్న చంటయ్యపల్లి గ్రామం వద్ద ముస్తఫాపూర్ గ్రామానికి చెందిన గీతా కార్మికుడు చెట్టు ఎక్కుతూ పామును చూసి భయభ్రాంతులకు గురై చెట్టుపై నుండి దూకేసిన వైనం... అదృష్టవశాత్తు భగవంతుడి కృపతో బతికి బట్ట కట్టాడు. రెండు సంవత్సరాల క్రితం భీమదేవరపల్లి గ్రామంలో తాటిచెట్టు ఎక్కుతుండగా మధ్యలో పాము తల భాగంలో మోకు పడడంతో ప్రాణాపాయం తప్పింది. వెంటనే స్పందించి తోటి వారిని పిలవడంతో వారు చెట్టు పైకెళ్ళి పామును చంపారు. ఇలాంటి సంఘటనలు మన మండలంలోనే కాదు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్నాయి. గీత కార్మికుల సంక్షేమం కొరకు సేఫ్టీ మోకులు వచ్చినప్పటికీ గ్రామానికి అతి తక్కువ రావడంతో గీతా కార్మికుల తిప్పలు తప్పడం లేదు. సేఫ్టీ మోకులపై గీత కార్మికులను సంప్రదిస్తే వారు పెదవి విరుస్తున్నారు. 20,000 పెట్టి కొన్నప్పటికిని అంతగా ఉపయోగపడడం లేదని, వాటి నిర్వహణ ఇబ్బందికరంగా ఉందని పలువురు గీతా కార్మికులు తెలిపారు.



# కార్పొరేట్ కంపెనీలకు రెడ్ కార్పెట్ పరుస్తున్న ప్రధాని మోడీ

- అర్హులైన వారికి 2 లక్షల రుణమాఫీ వెంటనే అందివ్వాలి
- రాజ్యాంగాన్ని కాపాడేందుకు ప్రజలు చైతన్యం కావాలి
- సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి

విశాలభారతి,భీమదేవరపల్లి :

దేశ ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో కొనసాగుతూ, ప్రధాని నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి 1 లక్ష 94 వేల కోట్ల రూపాయలు అప్పులతో నేడు భారతదేశ ఆర్థిక వ్యవస్థ కొనసాగుతుందని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం పూర్తిగా కార్పొరేట్ కంపెనీల చేతుల్లో కనుసన్నల్లో నడుస్తూ, వారికి రెడ్ కార్పెట్ పరుస్తూ, ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తుందని ఆగ్రహం వెలిబుచ్చారు. లాభాల్లో నడుస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలను పూర్తిగా నిర్వీర్యం చేస్తూ, ప్రైవేటు పెట్టుబడిదారులకు, కార్పొరేట్ కంపెనీలకు దారా దత్తం చేసే కుట్ర కొనసాగుతుందని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని, లౌకికతత్వాన్ని, భారత రాజ్యాంగాన్ని కాపాడడం కోసం ప్రజలు చైతన్యం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలు రైతు భరోసా, 2 లక్షల రుణమాఫీ, ఆశాలు, అంగన్వాడి వర్కర్స్, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పనుల బకాయిలను వెంటనే విడుదల చేసి, పేదవారిని ఆదుకోవాలని అన్నారు. బీసీల జన గణన వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని ఆయన స్పష్టం చేశారు. అనంతరం కొత్తకొండ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ చంద్రశేఖర్ గుప్తా తల్లి ఇటీవల మరణించిన విషయం తెలుసుకొని వారి కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆదరి శ్రీనివాస్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వుట్కూరు రాములు, కర్రె లక్ష్మణ్, రైతు సంఘం నాయకులు కొంగల రామచంద్రారెడ్డి, ఆదరి రమేష్, మార్పు సంజీవరెడ్డి, సుంచు కుమారస్వామి, రవి తదితరులు పాల్గొన్నారు.



# స్థానిక సమరానికి సై

- బిఆర్ఎస్ కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ పిలుపు

విశాలభారతి,భీమదేవరపల్లి :

త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని హుస్నాబాద్ మాజీ శాసనసభ్యులు వొడితల సతీష్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం బీమదేవరపల్లి మండల కేంద్రంలోని వెంకటసాయి గార్డెన్ లో భీమదేవరపల్లి మండల పరిధిలోని భారత రాష్ట్ర సమితి పార్టీ కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సతీష్‌కుమార్ మాట్లాడుతూ, ప్రజా నాయకులు నిత్యం ప్రజల్లోనే ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలను తెలుసుకుని, ప్రజలకు అండగా నిలవాలని, అలాగే పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. నాయకులంతా సమన్వయంతో పని చేస్తూ, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి పార్టీ నిర్ణయించిన అభ్యర్థుల గెలుపు కోసం అహర్నిశలు పని చేయాలని కోరారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో మళ్లీ బిఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయం అని సతీష్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మండల సురేందర్, నాయకులు వంగ రవి, సంగ సంపత్, జక్కుల అనిత, అప్పని పద్మ, శరీఫొద్దీన్, నవాబ్ పాషా, రజనాచారి, రచ్చ సంపత్, సదానందం తదితరులు పాల్గొన్నారు.





# పారిశ్రామిక వాడలో మత్స్యకారుల్ని ప్రత్యేకంగా పరిగణించండి

- ప్రతి ఒక్కరికీ సొసైటీ సభ్యత్వాలు కల్పించండి
- సొసైటీ సభ్యత్వాలు లేక పథకాల లబ్ధి కోల్పోతున్న మత్స్యకారులు..*
- పాశమైలారం పరిశ్రమల కాలుష్యం వల్ల విషపూరితంగా మారిన ఇస్నాపూర్ చెరువులు
- మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకెళ్లిన నీలం మధు ముదిరాజ్
- విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని అధికారులకు ఆదేశించిన మంత్రి
- కొడకంచి ఆదినారాయణ స్వామి జాతర, ఇస్నాపూర్ పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్టాపనకు రండి..

పటాన్ చెరు,విశాలభారతి

పటాన్ చెరు మండలం పాశమైలారం పారిశ్రామికవాడలోని ఇస్నాపూర్ గ్రామ మత్స్యకారులను ప్రత్యేకంగా పరిగణించాలని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టేడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ కోరారు. గురువారం ఇస్నాపూర్ మత్స్యకారూలతో కలిసి తెలంగాణ రాష్ట్ర దేవాదాయ, ఎన్విరాన్మెంట్ శాఖ మంత్రి, ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జ్ మంత్రి కొండా సురేఖను హైదరాబాద్ లోని ఆమె నివాసంలో కలిసి మత్స్యకారుల సమస్యపై వినతి పత్రం అందించారు. అనంతరం ఈ నెల 8వ తేదీన జిన్నారం మండలం కోడకంచి ఆదినారాయణ స్వామి జాతర, 21వ తేదీన ఇస్నాపూర్ పెద్దమ్మతల్లి విగ్రహప్రతిష్ఠ కార్యక్రమాలకు హాజరుకావాలని ఆహ్వానించారు.ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ పాశమైలారం పారిశ్రామిక వాడలో వెలువడుతున్న కాలుష్యం కారణంగా ఈ ప్రాంతంలో చెరువులు విషపూరితంగా మారాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమల నుంచి వస్తున్న వ్యర్ధ జలాలు చెరువులో కలవడం వల్ల ఇప్పటికే ఈ ప్రాంతంలో చాలా చెరువులలో చేప పిల్లలు మృత్యువాత పడుతున్నాయన్నారు. ఏ ఏ పరిశ్రమల ద్వారా చెరువులకు నష్టం జరుగుతుందన్న విషయాన్ని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ద్వారా విచారణ జరిపి నిగ్గు తేల్చాలని విజ్ఞప్తి చేశారు. కొన్ని చెరువుల్లో కాలుష్యం వల్ల చేపల పెంపకానికి అనువుగా లేకపోవడంతో ఇక్కడ మత్స్యకార సభ్యులకు సొసైటీలో సభ్యత్వం కల్పించే విషయంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆయన వాపోయారు. దీంతో ఇక్కడ మత్స్యకారులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన పథకాలలో అర్హత సాధించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాశమైలారం పారిశ్రామికవాడలో నెలకొన్న ఈ పరిస్థితుల నేపథ్యంలో ఇస్నాపూర్ మత్స్యకారులను ప్రత్యేకంగా గుర్తించి జిల్లా మత్స్యకార సహకార సంఘంలో సభ్యులుగా చేర్చుకోవాలని మరియు పరిశ్రమల నుంచి ప్రతి సంవత్సరం నష్ట పరిహారం ఇప్పించాలని ఆయన మంత్రిని కోరారు. ఈ విషయంలో సానుకూలంగా స్పందించిన మంత్రి కొండా సురేఖ సంబంధిత విజ్ఞప్తి పత్రంపై వెంటనే సంతకం చేసి పీసీబీ అధికారులకు విచారణ జరిపి నివేదిక ఇవ్వవలసిందిగా ఆదేశాలిచ్చారు. పారిశ్రామిక వాడలోనీ మత్స్యకారులకు న్యాయం జరిగే విధంగా శాశ్వత పరిష్కారం దిశగా నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిన్నారం బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ దాసరి శ్రీకాంత్ రెడ్డి, జిన్నారం, గుమ్మడిదల మండల అధ్యక్షులు వడ్డే కృష్ణ, నర్సింగ్ రావు, ప్రతాప్ రెడ్డి, మాణిక్ రావు, నారబోయిన శ్రీనివాస్, వీర్నాల సత్యనారాయణ, సుంకర బోయిన మహేష్,కొడకంచి ఆలయ అర్చకులు, ఇస్నాపూర్ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు మన్నే రాఘవేందర్, ఉళ్ళ శంకర్, ప్యాట నర్సింలు,యాదగిరి, పెంటయ్య, గోపాల్, రాజు, సోములు, మనోహర్, దశరథ్, రవి తదితరులు పాల్గొన్నారు.



# ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

- ఎల్వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ, సెయింట్ గ్రిగోరియస్ బాలాగ్రామ్ భాగస్వామ్యంతో కంటి వైద్య శిబిరం

ఇబ్రహీంపట్నం,విశాలభారతి:

మండలంలోని కప్పాడు గ్రామంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఎల్వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ, సెయింట్ గ్రిగోరియస్ బాలాగ్రామ్ భాగస్వామ్యంతో ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరానికి పెద్దఎత్తున వృద్ధులు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కంటి వైద్య శిబిరంలో పాల్గొన్న వారికి కంటి అద్దాలు, చుక్కల మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బాలాగ్రామ్ డైరెక్టర్ థామస్ పప్ప, సేభ సిస్టర్, హాస్పిటల్ సిబ్బంది , సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు సిహెచ్ జంగయ్య, పార్టీ మండల కార్యదర్శి సిహెచ్ బుగ్గరాములు , గ్రామ కార్యదర్శి జే ప్రభుదాస్, జంగయ్య, దాసు, రవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# అర్జున్ టీవీఎస్ షోరూంను ప్రారంభించిన హరీష్ రావు

పటాన్ చెరు,విశాలభారతి:

మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు రామచంద్రాపురం పట్టణం అశోక్ నగర్ లోని అర్జున్ టీవీఎస్ షోరూంను గురువారం ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన చేసి హరీష్‌రావు టీవీఎస్ షోరూంను ప్రారంభించారు. ఈ సందర్భంగా షోరూమ్‌ను టీవీఎస్ మోటార్ కంపెనీ జనరల్ మేనేజర్ కెంద్రాజ్ జోషి, ఆటోమేటెడ్ వర్క్ షాప్‌ను విశాల్ విక్రమ్‌సింగ్, స్పేర్‌పార్ట్స్ కౌంటర్‌ను వరుణ్ గుప్తాలు ప్రారంభించారు. తమ షోరూం ప్రారంభోత్సవానికి హాజరైన మాజీ మంత్రి హరీష్ రావుకి, టీవిఎస్ కంపెనీ నుండి వచ్చిన పెద్దలందరికి పేరుపేరునా టీవీఎస్ ప్రతినిధి అర్జున్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వెన్నవరం ఆదర్శ్ రెడ్డి, పటాన్ చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# రాడ్ బెండింగ్ యూనియన్ అసోసియేషన్ నూతన కమిటి ఎన్నిక

- పట్టణ అధ్యక్షులుగా పంతంగి కృష్ణ ఎన్నిక.

సూర్యాపేట,విశాలభారతి:



సూర్యాపేట పట్టణ రాడ్ బెండింగ్ యూనియన్ అసోసియేషన్ అధ్యక్షులుగా పంతంగి కృష్ణ గెలుపొందారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో సాయిని వెంకన్న ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఎన్నికల్లో 31 ఓట్ల తేడాతో దాసరి నగేష్ పై గెలుపొందినట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా రాడ్ బెండింగ్ యూనియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి ఘనంగా సంబరాలు నిర్వహించారు. గెలుపొందిన పట్టణ అధ్యక్షుడు కృష్ణను డివిజన్ తాపీ పనివారాల సంఘం అధ్యక్షుడు వల్దాసు (రెబల్) శ్రీను అభినందించి ఐక్యంగా సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. నూతనంగా ఎన్నికైన పట్టణ అధ్యక్షుడు మాట్లాడుతూ రాడ్ బెండింగ్ వర్కర్ల సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని తన గెలుపునకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాడ్ బెండింగ్ పట్టణ అసోసియేషన్ నాయకులు ఈదుల సురేష్, మెరుగు ప్రశాంత్, జానీ, కనుక కళ్యాణ్, ఎండి పాషా, మిర్యాల వీరబాబు, మనోజ్, జిల్లేపల్లి రాంబాబు, పాముల వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక



cinema updates



## అరవింద్ మాట మీద చైతన్య నమ్మకం!

నాగ చైతన్య, సాయి పల్లవి నటించిన తండేల్ సినిమా ఫిబ్రవరి 7న ప్రేక్షకుల ముందుకు రానున్న సందర్భంగా మేకర్స్ చిత్ర ప్రమోషన్స్ ను నెక్స్ట్ లెవెల్ లో నిర్వహిస్తున్నారు. చైతన్య, పల్లవి కలిసి ఇప్పటికే పలు ప్రధాన నగరాల్లో తండేల్ కు సంబంధించిన ఈవెంట్లలో పాల్గొని, అక్కడి మీడియాకు ఇంటర్వ్యూలిస్తూ బిజీబిజీగా ఉన్నారు.నాగ చైతన్య ఈ సినిమాతో తెలుగు, తమిళ, హిందీ ఆడియన్స్ ను టార్గెట్ చేశాడు. ఎలాగైనా తండేల్ తో మంచి హిట్ అందుకుని ఈ మూడు భాషల్లో క్రేజ్ తో పాటూ తన మార్కెట్ ను కూడా పెంచుకోవాలని చూస్తున్నాడు. నాగ చైతన్య కెరీర్లోనే తండేల్ భారీ బడ్జెట్ తో తెరకెక్కింది. కాబట్టి తండేల్ బ్లాక్ బస్టర్ అవాలంటే బాక్సాఫీస్ వద్ద చాలా పెద్ద మొత్తంలోనే కలెక్ట్ చేయాల్సి ఉంటుంది.అయినప్పటికీ తండేల్ సినిమా గ్రాండ్ సక్సెస్ అవుతుందని నాగ చైతన్య చాలా ధీమాగా ఉన్నాడు. దానికి కారణం నిర్మాత అల్లు అరవింద్. ఇప్పటికే అల్లు అరవింద్ తండేల్ సినిమా చూసి చాలా బావుందని, ఆ నమ్మకంతోనే చెప్తున్నా సక్సెస్ మీట్ లో తండేల్ గురించి మరిన్ని వివరాలు చెప్తానని ప్రీ రిలీజ్ ఈవెంట్ లో అన్న విషయం తెలిసిందే. ఏదైనా సినిమాను ప్రివ్యూ థియేటర్లో చూశాక ఆ సినిమా ఫ్యూచర్ ఏంటనేది కరెక్ట్ గా చెప్పడంలో అల్లు అరవింద్ దిట్ట అని, సినిమా చూశాక అరవింద్ గారు తనతో నీ కెరీర్లో ఇదే బిగ్గెస్ట్ ఫిల్మ్ అవుతుందని, నేషనల్ అవార్డు కూడా వచ్చే అవకాశం ఉందని చెప్పారని, ఆయన మాటల్ని బట్టే తాను కూడా తండేల్ సక్సెస్ ను మరింత స్ట్రాంగ్ గా నమ్ముతున్నట్టు చైతన్య వెల్లడించాడు.ఇదిలా ఉంటే గత కొన్ని సినిమాలుగా వరుస ఫ్లాపులతో అక్కినేని ఫ్యామిలీ హీరోలు తెగ ఇబ్బంది పడుతున్నారు. చైతన్యకు కూడా గత రెండు మూడు సినిమాలుగా అన్నీ డిజాస్టర్లే. ఈ నేపథ్యంలో అక్కినేని ఫ్యాన్స్ ఆశలన్నీ రేపు రిలీజ్ కాబోతున్న తండేల్ పైనే ఉన్నాయి. మరి తండేల్ వారి ఆశలను ఏ మేరకు నిలబెడుతుందో చూడాలి.

## హ్యాండ్ ఇచ్చిన త్రిప్తి


'ఆషీకీ' ప్రాంచైజీ నుంచి థర్డ్ ఇన్ స్టాల్ మెంట్ రెడీ అవుతోన్న సంగతి తెలిసిందే. యంగ్ హీరో కార్తీక్ ఆర్యన్ నటిస్తుండగా అనురాగ్ బసు తెరకెక్కిస్తున్నారు. ఈ ప్రాంచైజీలో హీరోయిన్ అత్యంత కీలకమైన నేపథ్యంలో ఆ పాత్ర కోసం స్టార్ హీరోయిన్లు దీపికా పదుకొణే..కత్రినా కైఫ్ లాంటి భామల్ని పరిశీలించారు. కానీ చివరి నిమిషంలో వాళ్లకంటే కొత్త నటి అయితే బాగుటుందని యువ నటి ఆకాంక్ష శర్మని అనుకుని చివరిగా ఆ ఛాన్స్ త్రిప్తీ డిమ్రీకి ఇచ్చారు.ఆకాంక్ష కంటే త్రిప్తి అయితే కార్తీక్ కి పర్ఫెక్ట్ జోడీగా సెట్ అవుతుందని అనురాగ్ పిలిచి మరీ ఛాన్స్ ఇచ్చాడు. త్రిప్తీ కూడా ఒకే చెప్పింది. అయితే ఇప్పడీ ప్రాజెక్ట్ నుంచి త్రిప్తీ డిమ్రీ ఎగ్జిట్ అయింది. పిలిచి మరీ అవకాశం ఇస్తే ఎగ్జిట్ అవ్వడంతో అనురాగ్ కాస్త అసంతృప్తిగానే ఉన్నాడు. ఎందుకు తప్పకుందో తనకే తెలియాలనేసాడు. దీంతో డేట్లు సర్దుబాటు కాకపోవడంతోనే ప్రాజెక్ట్ వదులుకున్నట్లు చిత్ర వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం త్రిప్తీ డిమ్రీ బాలీవుడ్ లో `ధడక్ 2` లో నటిస్తోంది. దీంతో పాటు మరో చిత్రానికి కూడా అగ్రిమెంట్ చేసుకుంది. అయితే ఈ రెండు సినిమాలకు ఏక కాలంలో షూటింగ్ కి హాజరవుతుంది. ఇదే సమయంలో `ఆషీకీ -2` షూట్ కూడా ప్లాన్ చేస్తున్నారుట. దీంతో ఒకే సమయంలో మూడు సినిమా షూటింగ్ లకు హాజరు కావడం సాధ్యం కకాపోవడంతోనే అమ్మడు ఎగ్జిట్ అయినట్లు తెలుస్తోంది.మూడేళ్ల క్రితం అవకాశం ఎప్పడొస్తుందా? అని ఎదురు చూసే బ్యూటీ ఇప్పడు ఆషీకీ లాంటి గొప్ప చిత్రంలో నటించే ఛాన్స్ వచ్చినా? వదులుకుందంటూ నెటి జనులు పోస్టులు పెడుతున్నారు. ఈ ప్రాజెక్ట్ విషయంలో అనురాగ్ త్రీప్తిని ఏరికోరి మరీ తీసుకున్నాడు. ఎంపిక చేసిన తర్వాత త్రిప్తీ డిమ్రీని తొలగించారనే ప్రచారం పెద్ద ఎత్తున జరిగింది. వాటిని మీడియా ముందుకొచ్చి మరీ అనురాగ్ ఖండిచాడు. ఆమెపై జరిగిన నెగిటివ్ ప్రచారాన్ని ఖండించి మద్దతుగా నిలిచాడు. కానీ చివరికి ఆయనకే హ్యాండ్ ఇచ్చిందీ బ్యూటీ.





## రాజమండ్రికి రామ్ షిఫ్టింగ్!

'ఇస్మార్ట్ శంకర్' తర్వాత ఎనర్జిటిక్ స్టార్ రామ్ కి సరైన సక్సెస్ పడలేదు. చేసిన ప్రయత్నాలేవి ఫలించలేదు. భారీ అంచనాల మధ్య రిలీజ్ అయిన సినిమాలు కనీస ప్రభావాన్ని కూడా చూపించలేకపోయాయి. వరుసగా నాలుగు సినిమాలు నిరుత్సాహ పరిచాయి. దీంతో రామ్ కి సక్సెస్ కీలకంగా మారింది. ప్రస్తుతం యంగ్ డైరెక్టర్ మహేష్ బాబు. పితో ఓ సినిమా చేస్తున్నాడు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తుంది. ఈ సినిమా షూటింగ్ కూడా నెమ్మదిగా జరుగుతోంది.ఇటీవలే హైదరాబాద్ లో కీలక సన్నివేశాలు చిత్రీకరించారు. ఈనేపథ్యంలో కొత్త షెడ్యూల్ రాజమండ్రి లో ప్లాన్ చేసారు. రామ్ సహా యూనిట్ త్వరలోనే రాజమండ్రికి ప్రయాణం కానుంది. ఇది లాంగ్ షెడ్యూల్. దాదాపు నెల రోజుల పాటు షూటింగ్ రాజమండ్రిలోనే గ్యాప్ లేకుండా చేస్తారుట. రాజమండ్రితో పాటు పరిసర గోదారి అందాలు..గ్రామాల్లో షూటింగ్ ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. రామ్ సినిమా షూటింగ్ లు రాజమండ్రిలో జరగడం కొత్తేం కాదు. ఆయన హీరోగా నటించిన చాలా సినిమాలు రాజమండ్రి అందాల్లో షూటింగ్ చేసారు. అయితే నెల రోజుల పాటు లాంగ్ షెడ్యూల్ షూటింగ్ చేయడం అన్నది ఇదే తొలిసారి. అలాగే సినిమాలో మరో స్టార్ కూడా భాగమవుతున్నట్లు తెలుస్తోంది. తెలుగుతో పాటు తమిళ, మలయాళ భాషల్లోనూ పేరున్న నటుడిని ఎంపిక చేయాలని మేకర్స్ భావి స్తున్నారుట. ఈ నేపథ్యంలో ఆ మూడు భాషల స్టార్ హీరోల పేర్లను పరిశీలిస్తున్నారుట. ఈ అంశంపై అతి త్వరలోనే స్పష్టత వస్తుందని తెలుస్తోంది. సినిమాలో ఆ హీరో పాత్ర చాలా బలంగా ఉంటుందని...నిడివి కూడా ఎక్కువగానే ఉంటుందని లీకులందు తున్నాయి. ఈనేపథ్యంలో ఏ హీరో ఎంపికైనా పారితోషికంగా కూడా భారీగానే చెల్లించే అవకాశం ఉంది. మైత్రీ మూవీ మేకర్స్ కాబట్టి ఆ విషయంలో ఎక్కడా రాజీ పడే పరిస్థితి ఉండదు. ఇందులో రామ్ కి జోడీగా భాగ్య శ్రీ భోర్సే హీరోయిన్ గా నటిస్తోంది.



## నాన్- బెయిలబుల్ వారెంట్?

బాలీవుడ్ నటి, ఎంపీ కంగనా రనౌత్ రీసెంట్ గా ఎమర్జెన్సీ మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ రాజకీయ జీవితాన్ని ఆధారం చేసుకొని రూపొందిన ఈ సినిమా ఎట్టకేలకు జనవరి 17వ తేదీన రిలీజ్ అయింది. బాక్సాఫీస్ వద్ద మిక్సడ్ రెస్పాన్స్ అందుకుంది ఎమర్జెన్సీ మూవీ. ప్రస్తుతం మాధవన్ తో మూవీ చేస్తున్న ఆమె.. రీసెంట్ గా ఫుడ్ బిజినెస్ మొదలుపెట్టిన సంగతి విదితమే. ది మౌంటైన్ స్టోరీ పేరుతో హిమాలయాల్లో ఏర్పాటు చేసిన కేఫ్.. ఫిబ్రవరి 14వ తేదీన ఓపెన్ కానుంది. తన చిన్ననాటి కల ఎట్టకేలకు ప్రాణం పోసుకుందని, చాలా హ్యాపీగా ఉన్నట్లు సోషల్ మీడియాలో కంగనా పోస్ట్ చేశారు. అదే సమయంలో కంగనా రనౌత్ చట్టపరమైన ఇబ్బందులను ఎదుర్కొనే అవకాశాలు ఉన్నట్లు ఇప్పడు వార్తలు వస్తున్నాయి. ఆమెకు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. బాలీవుడ్ గేయ రచయిత జావేద్ అక్తర్.. ఇటీవల పోలీసులను.. ఆమెకు నాన్ బెయిలబుల్ వారెంట్ ఇవ్వాలని కోర్టును కోరారు. కోర్టు హాజరు మినహాయింపు కోరుతూ కంగనా దాఖలు చేసిన పిటిషన్ ను కొట్టివేసినా ఆమె.. న్యాయస్థానానికి వెళ్లనట్లు తెలుస్తోంది. రిపోర్ట్స్ ప్రకారం, కంగనా చాలా తక్కువ సార్లు కోర్టుకు హాజరయ్యారు. దీంతో బాంద్రా కోర్టు నాన్-బెయిలబుల్ వారెంట్ జారీ చేయడానికి ముందు సమాధానం ఇవ్వడానికి చివరి అవకాశాన్ని ఇచ్చింది. ఇటీవల ఆమె హాజరు కాకపోవడానికి పార్లమెంటరీ బాధ్యతలని చెప్పారు ఆమె న్యాయవాది. అయితే చివరి అవకాశాన్ని బాంద్రా కోర్టు ఇవ్వగా.. ఆమె హాజరు కాకపోతే నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసే అవకాశాలు ఉన్నాయి.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.